రోడ్ల సంగతేంది జగనన్నా..?

- జిల్లాలో ఎటుచూసినా గతుకుల రహదారులే
- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా ఫలితం శూన్యం



యాదమరి మండలం పత్రపల్లె వద్ద కంకర తేలిన రోడ్డు

● జగనన్న రోడ్డుతో రూ.1.15 లక్షలు నష్టం



ఈయన పేరు హేమచంద్రారెడ్డి. పుత్తూరుకు చెందిన ఈయన ఇటీవల కారులో యాదమరి మీదుగా తమిళనాడులోని పరదరామికి వెళ్లారు. యాదమరి మండలం జోడిచింతల, మార్లబండ, కాశిరాల, భూమిరెడ్డిపల్లె, కొత్తూరు, పత్రపల్లె గ్రామాల మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. ఈ మార్గమంతా రహదారి ఛిద్రమైపోయి ఆనవాళ్లు లేకుండా పోయింది. కారు అనేకసార్లు గుంతల్లో పడింది. పెద్ద శబ్దం కూడా వచ్చింది. మరుసటి రోజు స్టార్ట్ చేస్తే ముందుకు కదల్లేదు. మెకానిక్‌ను పిలిచి చూపిస్తే ఇంజన్ ఆయిల్ ట్యాంకు పగిలి కారు సీజ్ అయిందని చెప్పాడు. షోరూమ్‌కు తీసుకెళితే రూ.1.15 లక్షల బిల్లు చెల్లించాల్సి వచ్చింది.

చిత్తూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ హయాంలో అనేక జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం చేశారు. నిధుల కొరత లేకపోవడంతో కొత్తవాటి నిర్మాణంతోపాటు పాత రోడ్ల విస్తరణ పనులు వేగంగా పూర్తయ్యాయి. రైల్వే గేట్ల వద్ద దశాబ్దాలుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగిస్తూ ఏడు ఆర్వోబీల నిర్మాణం కూడా పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పథకాల నిధుల విడుదలకు బటన్లు నొక్కడమే తప్పా.. రహదారుల అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. కనీసం ఏటా విడుదలయ్యే రహదారుల నిర్వహణా నిధులనూ ఈ ప్రభుత్వం మంజూరు చేయలేదు. తుఫాను వచ్చి కొట్టుకుపోయిన, ఛిద్రమైన రహదారులను శాశ్వతంగా బాగుచేసే ఆలోచనా చేయలేదు.

● తొలి ఏడాది రహదారుల పనులను రద్దు చేసిన వైసీపీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదలై సాగుతున్న రోడ్డు పనులను వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేసింది. ఆర్ అండ్‌బీ, పీఆర్ కలిపి రూ.300 కోట్ల వరకు పనులు రద్దయ్యాయి. ఇక రూ.20 కోట్ల విలువ చేసే పంచాయతీరాజ్ రోడ్డు పనులు 28 రద్దయ్యాయి. ప్రస్తుత తిరుపతి జిల్లాలోని ఎన్‌హెచ్71 నుంచి నారావారిపల్లె వరకు లింకు రోడ్డు నిర్మాణ పనులను రూ.21 కోట్లతో అప్పట్లో మంజూరు చేస్తే వైసీపీ రద్దు చేసింది. చంద్రగిరి మండలంలో రూ.కోటి విలువ చేసే చిన్న చిన్న పీఆర్ పనులు రద్దయ్యాయి. పుంగనూరు నుంచి శంకర్‌రాయలపేట మీదుగా బైరెడ్డిపల్లె వరకు లింక్‌రోడ్డు నిర్మాణ పనులను రద్దు చేసి మళ్లీ కొత్తగా మంజూరు చేసుకోగా, పనులు పురోగతిలో ఉన్నాయి.

● నివర్ తుఫానుతో ఛిద్రమైన రహదారులకు మరమ్మతులేవీ?

2021 చివర్లో జిల్లాను నివర్ తుఫాను కుదిపేసింది. ప్రాణ, పశు, పంట నష్టాలు పెద్దయెత్తున జరిగాయి. రహదారులు, చెరువులు వంటివి ధ్వంసమయ్యాయి. ప్రాణ, పశు, పంట నష్టాలకు పరిహారం ఇచ్చిన ప్రభుత్వం రహదారులు, చెరువుల శాశ్వత మరమ్మతులను పట్టించుకోలేదు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంది. ఉమ్మడి జిల్లాలో 321 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు, 539 ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతినగా శాశ్వత మరమ్మతులకు రూ.534 కోట్ల నిధులు అవసరమయ్యాయి. రూ.37 కోట్ల నిధులతో తాత్కాలిక మరమ్మతు పనులు చేశారే తప్పా నేటికీ శాశ్వత చర్యలకు పూనుకోలేదు.

● అధికారులు ప్రతిపాదనలు పంపాల్సిందే..

యాదమరి మండలంలోని జోడిచింతల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు 11 కిలోమీటర్లు రహదారి అధ్వానంగా ఉంది. చిత్తూరు నుంచి యాదమరి మీదుగా గుడియాత్తం వరకు ఉన్న ఈ అంతర్రాష్ట్ర రహదారిలో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిది నెలల కిందట పెట్రోల్ ట్యాంకర్ ఈ గుంతలమయమైన రోడ్డులో ఇరుక్కుంది. జేసీబీ సాయంతో రోడ్డును లోడి, లారీను బయటికి తీశారు. ఈ రహదారి మరమ్మతుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపిస్తున్నా, ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు.





● జిల్లా కేంద్రంలో వీధుల్లా ప్రధాన రహదారులు

ట్రాఫిక్ చిక్కులతో అవస్థలు పడుతున్న జిల్లా కేంద్రం చిత్తూరులో రహదారుల విస్తరణకు మోక్షం కలగడం లేదు. గాంధీ సర్కిల్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు ఇరుకైన రహదారిని అభివృద్ధి చేసేందుకు టీడీపీ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న ఆధ్వర్యంలో కొంతమేర రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించి విస్తరణకు సిద్ధం చేశారు. పనులు ప్రారంభమయ్యే దశలో ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది. జిల్లా కేంద్రం చుట్టూ హైవేలు విస్తరించినా, చిత్తూరు నగరంలో పరిస్థితి దారుణంగా ఉంది. పట్టించుకునే నాథుడే లేడు.



చిత్తూరు నగరంలో ఇరుకుగా వున్న గిరింపేట రోడ్డు



యాదమరి మండలం పత్రపల్లె వద్ద కనిపించని రహదారి ఆనవాళ్లు

● టీడీపీ హయాంలో మారిన రహదారుల రూపురేఖలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.639 కోట్లతో 1,509 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారులు అభివృద్ధి అయ్యాయి. ఇవి కాకుండా కేంద్రం రూ.9,300 కోట్లతో జాతీయ రహదారుల్ని అభివృద్ధి చేసింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ఎన్‌డీఏలో ఉండడంతో జిల్లాకు అవసరమైన రహదారులను, ఆర్వోబీలను మంజూరు చేసుకోగలిగింది. కేంద్ర, రాష్ట్రాల పర్యవేక్షణతో జిల్లా రహదారులకు మహర్దశ కలిగింది.





టీడీపీ హయాంలో కుప్పం పట్టణంలో వేసిన రోడ్డు - బైరెడ్డిపల్లె మండలం కుటాలవంక గ్రామానికి టీడీపీ హయాంలో వేసిన రోడ్డు



కల్లూరు బీసీ కాలనీలో ఏడేళ్ల కిందట టీడీపీ హయాంలో వేసిన సిమెంటు రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు షాదిక్ అలామ్

మద్యం, నగదు పంపిణీపై నిఘా పెంచండి


చిత్తూరు కలెక్టరేట్, మే 9: పోలింగ్‌కు మూడ్రోజులు మాత్రమే గడువు ఉందని, మద్యం, నగదు పంచేందుకు రంగం సిద్ధమైందని, వీటిపై మరింత నిఘా పెంచాలని చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం సాధారణ పరిశీలకుడు షాదిక్ అలామ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పరిశీలకులు అరవింద్ సాల్వే, రోహన్ ఠాకూర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. సాదిక్ ఆలాం, కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి గుర్తింపు కార్డులు, చెక్‌లిస్ట్ మేర పోలింగ్ సామగ్రి అందజేయాలని సూచించారు. పోలీసు పరిశీలకుడు అరవింద్ సాల్వే మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యయ పరిశీలకుడు రోహన్ ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు శ్రీనివాసులు, మనోజ్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటశివ, చిన్నయ్య, వెంకటరెడ్డి, మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్



పెద్దపంజాణి, మే 9: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మండలంలోని వీరప్పల్లె ఎండీయూ ఆపరేటర్ అనిల్ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వివాదాస్పదమైంది. దీనిపై టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రేపు చిత్తూరులో చంద్రబాబు సభ



చిత్తూరు సిటీ, మే 9: చిత్తూరులో శనివారం టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సభ ఉంటుందని ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మెసానికల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ సభ ఏర్పాట్లను ఆ పార్టీ నేతలు పర్యవేక్షిస్తున్నారు.

ఓటుకు నగదు బదిలీ

చిత్తూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో ఓటుకు నగదు బదిలీపై కొన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. ఓటర్లకు నేరుగా డబ్బులు పంపిణీ చేస్తుంటే తనిఖీ అధికాలు, పోలీసులు ఎక్కడికక్కడ దాడులు చేసి పట్టుకోవడం, నగదును సీజ్ చేస్తున్నారు. దీంతో కొంతమంది ఓటర్లకైనా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలని భావిస్తున్నారు. దీనికోసం వివిధ వ్యక్తులు, అనుచరుల ఖాతాలను వాడుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రోజున చిత్తూరులో ఇరు పార్టీల నాయకులు కొందరు ఓటర్ల వివరాలు తీసుకుని రూ.2 వేల చొప్పున ఫోన్ పే చేశారు. ఓటేసిన తర్వాత కూడా వారి నెంబర్లకు నగదు ట్రాన్స్‌ఫర్ చేశారు. పలమనేరులో వైసీపీ నాయకులు ఇళ్లకు వెళ్లి ఓటర్ల ఫోన్‌పే నెంబర్లను కలెక్ట్ చేశారు. ఆయా నెంబర్లకు డబ్బుల్ని ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అంతేకాకుండా అభ్యర్థులు.. తన అనుచరుల బ్యాంకు ఖాతాల్లో నగదును ఉంచి రోజువారి కార్యకలాపాలకు కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఫోన్ పేలు లేని స్లమ్ ఏరియాల్లో మాత్రం మాజీ వలంటీర్లను వెంట పెట్టుకుని వైసీపీ నేతలు నగదు పంపిణీ చేస్తున్నారు.

ఎస్‌ఐ మారుతిపై సస్పెన్షన్ వేటు

సదుం ఘటనలో నిర్లక్ష్యం ఫలితం



పుంగనూరు, మే 9: సదుం ఎస్ఐ ఇ.మారుతిపై గురువారం సస్పెన్షన్ వేటుపడింది. గత నెల 29వ తేదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత గ్రామం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెకి వెళ్లిన సమయంలో వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. సదుం పోలీస్‌స్టేషన్ వద్ద విధ్వంసానికి దిగాయి. ఈ విషయంలో ఎస్ఐ మారుతి నిర్లక్ష్యంగా వ్యవహరించారని బీసీవైపీ అధ్యక్షుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈసీ రెండు రోజుల క్రితం ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా డీఐజీ ఆయన్ను సస్పెండ్ చేశారు.

రూ.4లక్షల కర్ణాటక మద్యం సీజ్



పట్టుబడిన కర్ణాటక మద్యం

బంగారుపాళ్యం, మే 9: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని పాలేరు ఫ్లైఓవర్ వద్ద గురువారం పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న బొలేరో వాహనంలో 60 బాక్సుల్లో రూ.4లక్షల విలువచేసే 2,280 బాటిళ్ల కర్ణాటక మద్యం తరలిపోతుండగా పట్టుకున్నట్లు సీఐ లక్ష్మయ్య, ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వాహనం సహా మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి

● 17,885 మంది ఓటు హక్కు వినియోగం

చిత్తూరు కలెక్టరేట్,మే 9: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అత్యవసర సేవల ఉద్యోగులు, హోం ఓటింగ్‌కు సంబంధించి మొత్తం 20,380 మంది ఓటర్లకు బదులు గురువారం నాటికి 17,885 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,495 మంది వినియోగించుకోలేదు. ఈనెల 5 నుంచి గురువారం వరకు ఏడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా 15,554 మంది ఎన్నికల సిబ్బందిలో 14,114 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యవసర సేవకు సంబంధించి 4,331 మంది ఓటర్లకు గాను 3302 మంది, హోం ఓటింగ్ ద్వారా 495 మందికి బదులు 469 మంది వినియోగించుకున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

భువనేశ్వరికి ఘనంగా వీడ్కోలు



కుప్పం, మే 9: కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనను ముగించుకున్న నారా భువనేశ్వరి గురువారం ఉదయం బెంగళూరు బయలుదేరారు. ఆమెకు స్థానిక పీఈఎస్ కళాశాల వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితర నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె నాయకులను, కార్యకర్తలను పేరుపేరునా పలుకరించి వీడ్కోలు తీసుకున్నారు.

చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలి



మిట్టపల్లెలో ప్రచారంలో ఆంజినేయరెడ్డి

రామకుప్పం, మే 9: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి తెలిపారు. గురువారం వారు మండల పరిధిలోని మిట్టపల్లె, అడవిపాముగానిపల్లెల్లో ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రబాబు, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు తరపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రిగా, సీఎంగా చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధి పనులు నిరంతరాయంగా పూర్తికావాలన్నా, అర్హులందరికీ కచ్చితంగా సంక్షేమ ఫలాలు అందాలన్నా చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, నందారెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్రీ, నరసింహా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని ఆదరించండి



బెగ్గిలపల్లెలో ప్రచారం చేస్తున్న విశ్రాంత హెచ్‌ఎం వెంకటరమణ తదితరులు

గుడుపల్లె, ఏప్రిల్ 9: రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఆదరించాలని విశ్రాంత హెచ్‌ఎం హూల వెంకటరమణ కోరారు. గురువారం గుడుపల్లె మండలంలోని గ్రామాల్లో ఆయన టీడీపీ నేతలతో కలసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం వివరించారు. రాష్ట్రంలో వైసీపీ చీకటి పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగిపోయా యన్నారు. కుప్పం మరింత అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి సచివాలయ కన్వీనర్



టీడీపీలోకి చేరిన సచివాలయ కన్వీనర్ రాధాకృష్ణ

శాంతిపురం, మే 9: మండలం పరిధిలోని అబకలదొడ్డి గ్రామ సచివాలయ కన్వీనర్ రాధాకృష్ణ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మాజీ మండల అధ్యక్షులు విజయ రామిరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ శ్రేణులు ఎదురుగుట్టపల్లెలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకాలు చూసి ఓర్వలేక పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కుప్పంలో వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదని చంద్రబాబు సీఎం అయితేనే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చెంగప్ప, ఆంజినేయరెడ్డి, వెంకటేష్, రాము, బాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సీహెచ్‌వో అనురాధ

బైరెడ్డిపల్లె, మే 9 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పౌష్టికాహార ప్రాముఖ్యత, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సీహెచ్‌వో అనురాధ వివరించారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో కేంద్ర బలగాల కవాతు



సదుం, మే 9: సదుంలో గురువారం చౌడేపల్లె రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్ సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జాతరకు నగదు వసూళ్లు చేయరాదు

పలమనేరు, మే9 : పలమనేరులో ఈనెల 20, 21, 22 తేదీల్లో జరిగే గంగమ్మ జాతర సందర్భంగా ఎవరూ డబ్బులు వసూళ్లచేయకూడదని ఆలయ కార్యనిర్వాహణ అధికారి కమలాకరరావు ప్రకటనలో సూచించారు. విరాళాలు ఇవ్వదలిచిన భక్తులు ఆలయ కార్యనిర్వాహణ అధికారికి చెల్లించి రశీదులు పొందాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

కల్లూరు, మే 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పులిచెర్ల మండలంలోని అన్నిపోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాట్ల పనులు దాదాపు పూర్తయినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పోలింగ్ స్టేషన్ లోపల, వెలుపల భాగంలో సీసీ కెమెరాల ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం వెబ్ క్యాస్టింగ్ జరగనుంది. దీంతో పోలింగ్ కేంద్రాల బయట వంద మీటర్ల పరిధిలో జరిగే ప్రతి విషయాన్ని కెమెరాలు రికార్డు చేయనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల సంఘం ఆదేశాల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీసులు భారీగా మోహరించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.



కల్లూరు పోలింగ్ కేంద్రం లోపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ప్రతి మహిళకూ నెలకు రూ.1500: టీడీపీ





పలమనేరులో ప్రచారం చేస్తున్న నగిరి నాయకులు చలపతి తదితరులు, తీర్థంలో టీడీపీ నాయకుల ప్రచారం

పలమనేరు, మే9 : మాజీ మంత్రి అమరనాథరెడ్డిని గెలిపించాలని నగరికి చెందిన టీడీపీ నాయకుడు చలపతి ఆధ్వర్యంలో గురువారం పలమనేరులో ప్రచారం చేశారు. అమరనాథరెడ్డితో పాటు ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగిరి తెలుగు మహిళలు లత, అలిమేలు, రాధ, హేమ, ఉమ, కన్నెమ్మ, మణి వన్నన్, అరుల్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గండ్రాజుపల్లి గ్రామస్తులు

గంగవరం మండలం గండ్రాజు పల్లి గ్రామానికి చెందిన భూపతి, లక్ష్మీ నారా యణ, ఉల్లికుంట గ్రామానికి చెందిన శివరాజులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి అమరనాథరెడ్డి పార్టీకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డిశేఖర్, శ్రీకాంత్, రామక్రిష్ణ, వెంకటేష్, వెంకి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో గురువారం టీడీపీ స్థానిక నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జరగ నున్న ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని ఆదరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



పలమనేరులో టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమరనాథరెడ్డి

ప్రశాంతంగా రాజకీయ ర్యాలీలు నిర్వహించాలి



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫుల్లా

పుంగనూరు రూరల్, మే 9: పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు నిర్వహించే ర్యాలీలు, ప్రచారాలు ప్రశాంతంగా ముగించాలని చిత్తూరు అడిషినల్ ఎస్పీ ఆరీఫుల్లా సూచించారు. గురువారం రాత్రి పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ, బీసీవై పార్టీ, బీజేపీ, ఎస్డీపీఐ, వైసీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న రాజకీయ పార్టీలు చేపట్టే ర్యాలీల్లో నాయకులు ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా, గొడవలు జరగకుండా ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా ఒకవైపు రోడ్డు వదిలి ర్యాలీలు చేయాలని కోరారు. ప్రశాంతంగా ర్యాలీలు చేయాలని, ర్యాలీల్లో పోలీస్, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాజకీయ నాయకులు, పుంగనూరు, చౌడేపల్లె, కల్లూరు సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మే9: పుంగనూరు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఫ్యాషన్‌డిజైన్ అండ్ టెక్నాలజీ తదితర కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు వెల్డర్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. జూన్ 10 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తర్వాత సరిఫికెట్ల వెరిఫికేషన్ కళాశాలలో ఉంటుందని వివరాలకు గూడూరుపల్లె సమీపంలోని ఐటీఐ కాలేజీలో సంప్రదించాలని కోరారు.

దుస్థితిలో రామకుప్పం షాదీమహల్

- అప్పట్లో నిధులు మంజూరు చేసిన టీడీపీ ప్రభుత్వం
- వైసీపీ వచ్చాక పట్టించుకోని వైనం



రామకుప్పం, మే9: రామకుప్పంలోని షాదీమహల్ అవసాన దశకు చేరుకుంది. గత టీడీపీ ప్రభుత్వం షాదీమహల్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దానిని పట్టించుకోలేదు. 1999 సీఎంగా ఉన్న చంద్రబాబు రామకుప్పం పర్యటనలో పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వెనుక నిర్మించిన టీడీడీ కళ్యాణ మండపం ప్రాంభోత్సవానికి వెళ్తుండగా మార్గమధ్యంలో స్థానిక జామియా మసీదు వద్ద ఆయన కాన్వాయ్‌ను ముస్లింలు ఆపారు. తమకు షాదీమహల్ నిర్మించాలని కోరారు. అప్పటికప్పుడే షాదీమహల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న షాదీమహల్‌ను 2001 సెప్టెంబరు 12న చంద్రబాబు ప్రారంభించారు. అప్పటి నుంచి ముస్లింలు వివాహాది శుభకార్యాలను ఇక్కడే నిర్వహించుకునేవారు. నిర్మాణమై రెండు దశాబ్దాలు పూర్తికావడంతో అది మరమ్మతులకు గురైంది. దీంతో అక్కడ శుభకార్యాలు నిర్వహించుకోవడానికి అసౌకర్యంగా మారింది. స్థానికులు ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో 2019 ఫిబ్రవరి 21న షాదీమహల్ పునర్నిర్మాణం కోసం మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా రూ.40లక్షలు మంజూరు చేశారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రంజాన్‌తోఫా, షాదీముబారక్, ఇమాం, మౌజమ్‌లకు గౌరవవేతనాలు, మైనారిటీ కార్పొరేషన్లకు మంగళం పాడిన వైసీపీ ప్రభుత్వం ఇక్కడి షాదీమహల్ పునర్నిర్మాణాన్ని కూడా గాలికొదిలేసింది. ఐదేళ్లుగా ముస్లింలు శుభకార్యాల నిర్వహణ కోసం ప్రైవేటు కళ్యాణ మండపాలను ఆశ్రయిస్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.







ధ్వంసమైన ప్రహరీ విరిగిపోయిన తలుపు, అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు

దిన్నెమీద గంగమ్మకు ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, ఏప్రిల్ 9: మండలంలోని బండ కిందపల్లె పంచాయతీ కమ్మోళ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన దిన్నెమీద గంగమ్మ ఆలయంలో గురువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రతిష్ఠించి మండలం రోజులు పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతులు అందజేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు రూరల్, మే 9: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు డీజిల్ ఆదా చేయడం, కండక్టర్లు ఆర్టీసీ ఆదాయం పెంచడంతో వారికి ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు చెప్పారు. డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు అన్వర్, ఎస్.చలపతి, వై.శ్రీనివాసులును, ఆదాయం సాధించిన కండక్టర్ ప్రసాద్‌ను అభినందించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



పలమనేరు, మే9: పలమనేరు టీడీపీ కార్యాలయంలో గురువారం గంగవరం మండలం వేమనపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గణేష్ తెలుగుదేశం పార్టీలో చేరారు. గణేష్‌కు మాజీ మంత్రి అమరనాథరెడ్డి తనయుడు ప్రసేన్‌రెడ్డి పసుపు కండువా వేసి గణేష్‌ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రవీణ్, రెడ్డెప్ప, మునెప్ప, క్రిష్ణప్ప. బాబు, శ్రీరాములు, చలపతి, చంద్ర, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ఉంటే మాకేం..!

- 6.78 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- ప్లాట్లు వేసి విక్రయించేందుకు యత్నం





కమ్యూనిటీ భవనాన్ని వదిలిపెట్టి మిగిలిన ప్రభుత్వ భూమికి ప్రహరీ నిర్మించిన దృశ్యం

రేణిగుంట, మే 9: నిన్న మొన్నటి వరకు కాలువలు, చెరులువులు, ప్రభుత్వ భూములను కబ్జాలు చేశారు. అవేవీ చాలవన్నట్లు ఏకంగా కోర్టు వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేశారు. దానికి ప్రహరీ నిర్మించి ప్లాట్లు వేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 758/4డీఈలో ఇద్దరికి ఒకటిన్నర ఎకరా చొప్పున అప్పట్లో ప్రభుత్వం వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించింది. ఈ సర్వే నెంబరుకు ఆనుకొని పోరంబోకు భూమి 3.78 ఎకరాలు ఉంది. దీని పక్కనే ప్రైవేటు వెంచరు ఉండటంతో ఈ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4కోట్లు పలుకుతోంది. గతంలో ఇదే భూమిని చదును చేసి విక్రయించేందుకు ప్రయత్నించగా అప్పటి తహసీల్దారు అడ్డుకున్నారు. ఆ భూమిలో వ్యవసాయం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని డీకేటీ పట్టాదారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ భూమిపై స్టేటస్ కో ఇచ్చింది. ఇది ప్రభుత్వానికి చెందుతుందని అప్పటి తహసీల్దారు అపీల్ చేశారు. ఇదిలా ఉండగా వైసీపీకి చెందిన ఓ న్యాయ సలహాదారుడు రంగంలోకి దిగి డీకేడీ పట్టా ఉన్న మూడు ఎకరాలతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమి 3.78ఎకరాలను కలుపుకుని 6.78 ఎకరాల భూమిని చదును చేశారు. ఈ సర్వే నెంబరులోనే ప్రభుత్వ కమ్యూనిటీ భవనాన్ని మినహాయించి మిగిలిన భూమికి ప్రహరీ నిర్మించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టించుకోలేదు. కలెక్టర్ స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జీడీనెల్లూరులో మహిళా ఓటర్లే అధికం

మొత్తం ఓటర్లు 204949 ● పురుష ఓటర్ల సంఖ్య 101853

మహిళా ఓటర్లు 103090 ● ట్రాన్స్‌జెండర్స్ 6

వెదురుకుప్పం, మే9: గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 204949 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 101853, మహిళా ఓటర్లు 103090 మంది ఉన్నారు. మహిళా ఓటర్లే 1237 మంది అధికం. ట్రాన్స్ జెండర్లు ఆరుగురు ఉన్నారు. కాగా, సర్వీసు ఓటర్లు 475 మందిలో పురుషులు 466, మహిళలు 9 మంది ఉన్నారు. పీడబ్ల్యూడీ ఓటర్లు 3582 మంది. వీరిలో 2126 మంది పురుషులు, 1456 మంది మహిళలు. 18-19ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 5094మంది. వీరిలో పురుషులు 2841 మంది, మహిళలు 2253 మంది ఉన్నారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 951 మంది ఉండగా వీరిలో పురుషులు 373, స్త్రీలు 578 మంది ఉన్నారు. ఓవర్‌సీస్ (ఎన్‌ఆర్‌ఐ) ఓటర్లు 13 మంది ఉన్నారు. 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేస్తాం: టీడీపీ



చీకలచేనులో ప్రచారం చేస్తున్న చల్లా బాబు

పుంగనూరు, మే 9: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కావాలంటే ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. గురువారం పుంగనూరు మండలం నెక్కుంది, బండ్లపల్లె పంచాయతీల్లో ఆయన టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. తనను ఆశీర్వ దించాలని కోరారు. అన్నదాతకు ఏటా రూ. 20వేలు, 18ఏళ్లు నిండిన స్త్రీలకు ప్రతి నెలా రూ.1500లు, చదువుకునే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15వేలు, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, పింఛను రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పింఛను ఇస్తా మని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల పంచాయతీలో చల్లారామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియా రెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. టీడీపీ అధికారం లోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, కమలం గుర్తుపై ఓటేసి రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ నాయకుడు సుందరం, నౌషాద్, శ్రీనివాసులు నాయడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె చల్లా పూజారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులోని కొత్తకాలనీ, బీసీ కాలనీ, ఇందిరానగర్, కోటపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆమె ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు మురళీనాయుడు, నూర్‌బాషా, ఖాదర్‌వల్లి, అష్రఫ్ పాల్గొన్నారు.

సదుం: మండలంలోని మొరవపల్లె పంచాయతీలోని చీకలచేనులో చల్లారామచంద్రారెడ్డి ప్రచారం చేశారు.

వరుస చోరీలతో కలకలం

శ్రీకాళహస్తి, మే 9: శ్రీకాళహస్తి పట్టణంలో ఒకేరోజు నాలుగు ఇళ్లలో వరుస చోరీలు కలకలం రేపాయి. శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు... పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ చెందిన ఇక్బాల్ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. బుధవారం ఆయన విధులకు వెళ్లిన సమయంలో కుటుంబ సభ్యులు బంధువుల ఇంట శుభకార్యం కోసం ఊరికి వెళ్లారు. బుధవారం రాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడి సుమారు 65 గ్రాముల వెండి వస్తువులు, రూ.50 వేల నగదును చోరీ చేశారు. ఆ పక్కనే మరో ప్రైవేటు ఉద్యోగి ఇంట్లో రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత సమీపంలోని మరో రెండు ఇళ్లలో చోరీ చేసేందుకు కిటికీలు పగలగొట్టి విఫలయత్నం చేశారు. ఉదయం చోరీలు జరిగినట్లు తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇక్బాల్ భార్య జుబేదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మిగిలిన బాధితులు ఫిర్యాదు చేసేందుకు నిరాకరించారు. తిరుపతి నుంచి క్లూస్ టీం బృందం వచ్చి ఆధారాలను సేకరించింది. ఇక చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఆరుగురు దొంగలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇతర పోలీస్ స్టేషన్లకు వీడియోను పంపి దొంగలు ఎవరన్నది నిర్ధారించేందుకు విచారణ చేస్తున్నారు.



ఇక్బాల్ ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

టీడీపీ నేత హాస్పిటల్ ఎదుట
వైసీపీ కార్యకర్తల వీరంగం



బ్యారికేడ్లను పడదోస్తున్న అధికార పార్టీ కార్యకర్త

కుప్పం, మే 9: టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబుకు చెందిన నర్సింగ్ హోమ్ ఎదుట గురువారం వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించాయి. కుప్పం-పలమనేరు బైపాస్ రోడ్డులో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఈ నర్సింగ్ హోమ్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా బారికేడ్స్ పెట్టారు. మధ్యాహ్నం పైన కుప్పం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌కి వెళ్లారు. ఆయన వెంట వెళ్లిన కొంతమంది వైసీపీ నాయకులు కొంతసేపటి తర్వాత సురేశ్‌బాబు నర్సింగ్ హోమ్ వద్దకు చేరుకుని దుర్భాషలాడుతూ అక్కడున్న బారికేడ్లను పడదోసి, తొక్కుతూ వీరంగం సృష్టించారు. ఆ సమయంలో నర్సింగ్ హోమ్‌కు వచ్చిన రోగులు భయభ్రాంతులకు గురయ్యారు.

60 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 9: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మకంగా గుర్తించిన 60 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి అన్ని కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం సాయంత్రం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో బీఎల్వోలతో ఆయన సమీక్షించారు. ఆదివారం సాయంత్రంలోగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పులు అందలేదనే ఫిర్యాదులు వస్తే సంబంధిత బీఎల్వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లకు ఎన్నికల విధులపై అవగాహన



ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన కల్పిస్తున్న ప్రొబేషనరీ డీఎస్పీ పావన్‌కుమార్

చిత్తూరు, మే 9: కొత్తగా జిల్లాకు వచ్చిన ట్రైనీ ఐపీఎస్ అధికారులకు ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన విధి విధానాలు, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ప్రొబేషనరీ డీఎస్పీ పావన్‌కుమార్ అవగాహన కల్పించారు. గురువారం స్థానిక పోలీసు అతిథిగృహంలో చేపట్టిన కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఈవీఎంలకు గట్టి భద్రత



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 9: పోలింగ్ అనంతరం నియోజకవర్గాల నుంచి తరలివచ్చే ఈవీఎంలను భద్రపరిచే అంశంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. గురువారం రాత్రి ఓట్ల లెక్కింపు కోసం ఎంపిక చేసిన శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్వీసెట్‌లో నియోజకవర్గాలవారీగా ఏర్పాటు చేయనున్న రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన చిత్తూరు ఆర్డీవో జి.చిన్నయ్యతో కలిసి పరిశీలించారు. వారి వెంట పలు విభాగాల అధికారులు ఉన్నారు.

14 నుంచి గంగజాతర



మీడియాతో మాట్లాడుతున్న ఉత్సవ ధర్మకర్తలు

చిత్తూరు కల్చరల్, మే 9: నగరంలో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు నడివీధి గంగమ్మజాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే లావణ్యాబాబు తెలిపారు. గురువారం తన నివాసంలో ఉత్సవ నిర్వాహకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ 14న చాటింపు, 15 నుంచి 20 వరకు అమ్మవారికి భక్తులు పొంగళ్లు, తోటివేషాలు, దీపారాధనలు ఉంటాయని వివరించారు. ఎన్నికల కారణంగా ఈ సంవత్సరం జాతరను 21, 22 తేదీలకు మార్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో గుణశేఖర్, వెంకటేష్, హేమంత్‌కుమార్, సత్య, పొన్నియమ్మగుడి అర్చకులు కేదారేశ్వర స్వామి పాల్గొన్నారు.

నేటిలోగా పోలింగ్ పాఠశాలలను అప్పగించండి

● ఎంఈవోలకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 9: పోలింగ్ నిర్వహణ కోసం గుర్తించిన అన్ని మేనేజ్‌మెంట్లలోని పాఠశాలలను శుక్రవారం లోగా సెక్టోరల్ అధికారులకు అప్పగించాలని ఎంఈవోలను జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈవోలతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలలను శుభ్రపరచి, ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఒకే పాఠశాల ప్రాంగణంలో ఉంటే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ (మైక్)ను అందుబాటులో ఉంచాలన్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, సమగ్రశిక్షా ఏపీసీ వెంకట్రమణారెడ్డి, డీఈవో దేవరాజులు పాల్గొన్నారు.

నేడు పుత్తూరుకు జగన్

పుత్తూరు అర్బన్, మే 9: సీఎం జగన్ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు పుత్తూరులో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభకు హాజరు కానున్నారు. పట్టణంలోని కాపువీధి జంక్షన్ వద్ద సభ జరిగే ప్రదేశాన్ని ఎస్పీ విక్రమ్ పాటిల్ గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు.ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జగన్ దిగేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు.జగన్ సభ విజయవంతం చేసేందుకు నగరి నుంచే కాకుండా సత్యవేడు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల నుంచి కూడా వైసీపీ నేతలు జనసమీకరణ చేస్తున్నట్లు తెలిసింది.

10 నుంచి రామానుజ అవతార ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), మే 9: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8.30 వరకు సాహిత్య, సంగీత సభలు జరుగుతాయి. తొలి రోజు మే 10న సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయరు స్వామి, చినజీయరు స్వామి మంగళాశాసనంతో కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య చక్రవర్తి రంగనాథన్.. రామానుజ వైభవంపై ప్రసంగిస్తారు. తరువాత రేవతి బృందం భక్తి సంగీత విభావరి ఉంటుంది.

20వేల ఓటరు స్లిప్పుల గల్లంతు?

విచారణకు ఆదేశించిన కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), మే 9 : తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 20వేల ఓటరు స్లిప్పులు గురువారం గల్లంతైనట్లు సమాచారం.తిరుపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం బుధవారం ముగిసింది.పంపిణీ కాకుండా మిగిలిన ఓటరు స్లిప్పులను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బీఎల్వోలు సమర్పించాలి. ఇలా సమర్పించిన 60 వేల ఓటరు స్లిప్పుల్లో 20వేల దాకా గల్లంతైనట్లు తెలియడంతో అప్రమత్తమైన రిటర్నింగ్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయమై తిరుపతి అర్బన్ తహసిల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా 20 వేల ఓటరు స్లిప్పులు గల్లంతు కాలేదని, ఓ బీఎల్వో వద్ద వున్న 70 ఓటరు స్లిప్పులను గుర్తు తెలియని వ్యక్తులు బయట పారేశారన్నారు.వాటిని తిరిగి తెచ్చి భద్రపరిచారన్నారు.

56వేల ఓటర్ స్లిప్పులను బయటపెట్టాలి

ఆరణి శ్రీనివాసులు డిమాండ్

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో పంపిణీ చేయకుండా వెనక్కి వచ్చిన 56వేల ఓటర్ స్లిప్పులను వెంటనే బహిర్గతం చేయాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మార్చినెలలో ప్రస్తుత ఆర్వోనే కార్పొరేషన్ కమిషనర్‌గా, ఇదే బీఎల్వోలు పనిచేశారని గుర్తుచేశారు. కేవలం వైసీపీకి అధికారులు కొమ్ముకాయడం వల్లే 56వేల ఓటర్ స్లిప్పులు వెనక్కి వచ్చాయని మండిపడ్డారు. వెనక్కి వచ్చినవన్నీ దొంగ ఓటర్లవేనని, ఆ లిస్టును బహిరంగ పరచాలని కోరారు. ఎన్నికల సంఘం ఫిబ్రవరి, మార్చిలోపు దొంగ ఓట్ల తొలగింపునకు అవకాశం ఇచ్చినా అధికారులు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. దేశంలోనే 16 అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటిగా ఉన్న తిరుపతిలో గత ఎన్నికల్లోనే 174 పోలింగ్ కేంద్రాల్లో బలగాలను నియమిస్తే, ప్రస్తుతం కేవలం 40 కేంద్రాల్లోనే బలగాలను ఏర్పాటు చేయడం వైసీపీకి మేలు చేయడానికేనని ఆరోపించారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు స్పందించి, తిరుపతిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు కోసం
ప్రచారం చేయడం గర్వంగా ఉంది

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామ్‌దాస్





అభివాదం చేస్తున్న అన్బుమణి రామ్‌దాస్ - హాజరైన వన్నెకుల క్షత్రియ కులస్తులు

కుప్పం, మే 9: విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు కోసం ప్రచారం చేయడం గర్వంగా ఉందని తమిళనాడుకు చెందిన పీకేఎం (పట్టాలి మక్కల్ కచ్చి) అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రామ్‌దాస్ అన్నారు. కుప్పం టీడీపీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ కులస్తుల సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. తమిళనాడులో రామ్‌దాస్‌పురం లాగా ఒకప్పుడు కుప్పం పనిష్మెంట్ ఏరియాగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. అటువంటి ప్రాంతాన్ని సకల రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన్ను లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ చిత్తూరు ఎంపీ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్.రాజన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దారుణంగా నష్టపోయిందన్నారు. వన్నెకుల క్షత్రియుల్లో వెనుకబాటు ఉందని, చంద్రబాబు పాలనలో వారి కోసం అనేక పథకాలు అమలు చేసి, ఆదుకున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును, చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబులు మాట్లాడుతూ కుప్పం ప్రజలు ఓటేయబోయేది కాబోయే ముఖ్యమంత్రికి అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ టీడీపీని గెలిపించడం ద్వారా వన్నెకుల క్షత్రియులు వారి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలని కోరారు. కుప్పం మాజీ ఎంపీపీ సాంబశివం, నాలుగు మండలాల వన్నెకుల క్షత్రియ కులస్తుల అధ్యక్షులు, ఇతర నాయకులు మాట్లాడారు.

గోవిందరాజ స్వామి ఆలయంలో
కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(కల్చరల్) మే 9: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయంలో మే 16 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని సంప్రదాయరీతిలో వివిధ పరిమళద్రవ్యాలతో శుద్ధిచేశారు. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణారెడ్డి, అర్చక బృందం పాల్గొన్నారు.

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కల్చరల్), మే 9: తిరుపతిలో టీటీడీకి చెందిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి ఈనెల 25వ తేదీనుంచి దరఖాస్తులు ఇవ్వనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 12వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని టీటీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సంగీత, నృత్య కళాశాలలో.. గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ. మృదంగం, డోలు, ఘటం విభాగాల్లో విశారద(ఫుల్‌టైం), ప్రవీణ (డిప్లొమో) కోర్సులున్నాయి.

నాదస్వర, డోలు పాఠశాలలో..

నాదస్వర, డోలు పాఠశాలలో ఫుల్ టైం సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులున్నాయి. బయటి ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంది. కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. పూర్తి వివరాలకు 0877-2264597, 73308 11173, 98483 74408, 94407 93205 నెంబర్లను సంప్రదించాలి.

తగ్గిన ఎండవేడిమి

చిత్తూరు కలెక్టరేట్, మే 9: జిల్లాలో నాలుగైదు రోజులుగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో ఎండవేడిమి కాస్త తగ్గింది. మండుతున్న ఎండలతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి ఉపశమనం లభించింది. మే నెలలో జిల్లావ్యాప్తంగా 67.2 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, గురువారం వరకు 46.6 మి.మీ నమోదైంది. గత నెల రోజులుగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీలు నమోదయ్యాయి. గురువారం అన్ని మండలాల్లో 39 డిగ్రీల్లోపు నమోదైంది. చిత్తూరులో 38.4, గుడిపాల 38.4, తవణంపల్లెలో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, మిగిలిన మండలాల్లో అంతకులోపు నమోదైంది.

దద్దమ్మ పాలనకు చరమగీతం పాడండి

ఐదేళ్లుగా కుంభకర్ణుడి నిద్రలో వైసీపీ ప్రభుత్వం - సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు

మాజీ మంత్రి అమరనాథరెడ్డి - వి.కోట రోడ్‌షోలో పోటెత్తిన పసుపుసైన్యం





బహిరంగ సభలో ప్రసంగిస్తున్న అమరనాథరెడ్డి - ర్యాలీలో పాల్గొన్న పసుపు దండు, జనసైనికులు

వి.కోట, మే 9: అమరావతిని ఆపేసి మూడు రాజధానులంటూ అందరినీ మోసం చేసిన వైసీపీ దద్దమ్మ పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వి.కోటలో టీడీపీ రోడ్‌షో, ర్యాలీ నిర్వహించింది. మార్కెట్ యార్డు నుంచి ఎంజీ రోడ్డు మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలసి అమరనాథరెడ్డి ఈ ర్యాలీలో పాల్గొనగా గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. స్థానిక కేసీఎప్ బస్టాండు కూడలిలో ప్రజలను ఉద్దేశించి అమరనాథరెడ్డి మాట్లాడారు. సీఎం జగన్ డ్రామాలను జనం నమ్మే పరిస్థితి లేదన్నారు.

బైపాస్ అలైన్‌మెంట్ మారుస్తాం..

గత టీడీపీ హయాంలో మంజూరు చేసిన షాదీ మహల్, అంబేడ్కర్ భవన్, కోల్డ్ స్టోరేజ్, బీసీ భవన్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారని అమరనాథరెడ్డి వివరించారు. ముఖ్యంగా వి.కోటకు బైపాస్ రోడ్డు కర్నాటక మీదుగా తరలిస్తే ఇక్కడి అధికార పార్టీ నేతలు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తూర్పు దిశగా అలైన్‌మెంట్ మార్పుచేసి తీరుతామని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిల్ చట్టం వల్ల కలిగే అనర్థాలను ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, నాయకులు రాంబాబు, సుబ్బన్న, చౌడప్ప, సోము, విశ్వనాథ్, ధీరజ్, శబరీష్, నారాయణస్వామి, సతీష్, జనార్దన్ రెడ్డి, నాగరాజ్, చంద్రారెడ్డి, శివకుమారి, నాసీర్, రుహుల్లా, షేక్‌ఉమ్మర్, నారాయణరాజు, ఉదయ్, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

కుప్పం, మే 9: దళితుల అభివృద్ధి టీడీపీతోనే ముడిపడి ఉందని ఆ పార్టీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. కుప్పంలో గురువారం జరిగిన దళితుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన పలు విషయాలపై చర్చించారు. అధికారం వచ్చిన వెంటనే యువతకోసం ప్రత్యేకంగా ఒక కార్యాలయం ఏర్పాటు చేసి, హెల్ప్‌డెస్క్ పెట్టి ఉద్యోగావకాశాలు, సలహాలు, స్కిల్ డెవలప్మెంట్ చేస్తామని అన్నారు. ఇదంతా జరగాలంటే రాష్ట్రంలో సమర్థమైన నాయకుడు చంద్రబాబు సీఎం కావాలని తెలిపారు. రాష్ట్రం బాగుపడితే దళితులు, బీసీ, మైనారిటీ వర్గాలు బాగుపడతాయన్నారు. యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన వైసీపీకి తగిన బుద్ధి చెప్పి టీడీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని దగ్గుమళ్ల కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు.



దళితుల ఆత్మీయ సమావేశంలో దగ్గుమళ్లకు సన్మానం

ఆది, సోమవారాల్లో పత్రికా ప్రకటనలకు
ముందస్తు అనుమతి అవసరం

● అభ్యర్థులకు జిల్లా ఎన్నికల అధికారి సూచన

చిత్తూరు కలెక్టరేట్, మే 9: ఎన్నికల సంఘం జారీచేసిన ఉత్తర్వుల మేరకు ఈనెల 12, 13 తేదీల్లో (పోలింగ్‌కు ముందురోజు, పోలింగ్ రోజు) పత్రికల్లో ప్రకటనల నిమిత్తం అభ్యర్థులు రెండ్రోజులు ముందుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. పత్రికా యాజమాన్యాలు కూడా ఎంసీఎంసీ అనుమతి పత్రాలు లేకుండా ప్రకటనలు ప్రచురించరాదని సూచించారు. అభ్యర్థి, పార్టీ తరఫున సంస్థలు లేదా వేరే వ్యక్తి ఇచ్చే ప్రకటనలకు సైతం ఇవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

అమ్మవారికి కానుకగా బంగారు శఠారి



తిరుచానూరు, మే 9: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి వైజాగ్‌కు చెందిన దాత మస్తాన్‌రావు 425 గ్రాముల బరువు గల బంగారుశఠారిని తయారు చేయించి ఆలయ అధికారులకు అందజేశారు. గురువారం డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌కు దాత మస్తాన్‌రావు కుటుంబ సభ్యులు రూ.25లక్షలు విలువ చేసే బంగారు శఠారిని అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకుడు బాబుస్వామి పాల్గొన్నారు.

ఇలా అయితే.. ఎలా?


ఎస్వీయూ హెల్త్ సెంటర్‌లో వీసీ తనిఖీలు

సిబ్బంది గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: విద్యార్థులు, ఉద్యోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాల్సిన హెల్త్ సెంటర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా? అని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం వీసీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచీ విధి నిర్వహణకు సిబ్బంది హాజరు కావలసి ఉండగా, 8.45 గంటలు అయినా ఒకరిద్దరు మినహా సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ షాపు, ల్యాబ్, నర్సింగ్ వంటి సెక్షన్లకు సంబంధించిన 22 మంది సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం ఏమిటని అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించారు. ఈ పరిస్థితి మారకపోతే చర్యలు తప్పవని వీసీ స్పష్టం చేశారు. గైర్హాజరుపై ఉద్యోగులు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

13న కార్మికులకు సెలవు

తిరుపతి(ఆటోనగర్), మే 9: రాష్ట్రంలో ఈ నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వం సెలవు ప్రకటించిందని ఉపకార్మిక కమిషనర్ బాలూనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, ఇతర ప్రైవేటు సంస్థల యజమానులు ఈ ఆదేశాలను అమలుచేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రోజమ్మ కలిపింది అందరినీ...

నగరి నియోజకవర్గంలో నాయకులంతా ఏకమవుతున్నారు. ఇదేదో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజా రాజకీయ చతురత, నాయకత్వ పటిమతోనే సాధ్యమైందనుకుంటే పొరబడినట్టే. దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థి వర్గాలుగా కొనసాగుతున్న నేతలంతా ఇప్పుడు రోజా ఓటమి కోసం చెట్టాపట్టాలేసుకుంటున్నారు. నిండ్ర మండలంలో రెడ్డివారి కుటుంబం ఏళ్ల తరబడి టీడీపీతో పోరాటం చేసింది. ఐదేళ్లుగా రోజా వ్యవహారశైలితో విసుగు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురం లక్ష్మీపతిరాజు ఇదే తీరున టీడీపీ గూటికి చేరారు. పుత్తూరులో డీఎన్ ఏలుమలై కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో హోరాహోరీగా తలపడినా రోజా తీరు నచ్చక గత నెలలో టీడీపీలో చేరారు. వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి 2014,2019లో వైసీపీకి బలంగా పనిచేశారు. టీడీపీతో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో రాజకీయాలు నెరిపారు. వైసీపీలో ఉక్కబోతను భరించలేక టీడీపీ కండువా కప్పుకున్నారు. కొసమెరుపు ఏంటంటే చాన్నాళ్లుగా వైరి వర్గాలుగా వ్యవహరించిన ఈ నాయకులంతా కొద్దిరోజులుగా సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. గాలి భానుప్రకాష్ గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రోజా ఓటమే సింగిల్ పాయింట్ ఎజెండాగా వీరు పనిచేస్తున్నారు.

- పుత్తూరు అర్బన్

సమస్యలపై నిలదీస్తే సహించరు. విపక్షాల ఉనికిని భరించలేరు. ఇతర పార్టీ కార్యక్రమాలకు అధికారికంగా అనుమతులు ఇవ్వరు. కాదూ కూడదంటే వైసీపీ శ్రేణులు దాడులకు దిగతారు. వీరికి పోలీసులూ వత్తాసుగా నిలబడతారు. బాధితులపైనే కేసులు పెడతారు. మరోవైపు అభివృద్ధి జాడలూ కనిపించవు. ఇక్కడి పోలీసులు, అధికారులు అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా పెద్దిరెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ విపక్షాలు మండిపడుతుంటాయి. ఈ ఐదేళ్లలో పుంగనూరు నియోజకవర్గంలో సాగిన నియంతస్వామ్యమిది.

కథనం - పుంగనూరు

అరాచకం.. విధ్వంసం

- ప్రతిపక్షాలపై దాడులు, అక్రమ కేసులు
- బాధితులపైనే కేసులు ఇక్కడి 'స్పెషల్'
- పెద్దిరెడ్డి కనుసన్నల్లో పోలీసులు, అధికారులు
- కనిపించని అభివృద్ధి జాడలు
- ఐదేళ్లలో ఇదీ పుంగనూరు ప్ర'గతి'







నంజంపేటలో దాడికి కర్రలతో సిద్ధంగా ఉన్న వైసీపీ శ్రేణులు- నంజంపేటలోనే టీడీపీ శ్రేణులపై వైసీపీ వారు విసురుతున్న రాళ్లు (ఫైల్ ఫొటోలు)

పుంగనూరులో ప్రత్యర్థుల మీద, ప్రశ్నించినవారి మీద దాడులు చేయని రోజు, కేసు పెట్టని రోజు, అరెస్టు చేయని రోజు లేదు.
- పుంగనూరు ఘటనలపై ఇటీవల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

'పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి ఒక్కటీ తేనందుకా? యువతకు ఉపాధి కోసం ఇతరులు మెగా జాబ్ మేళా పెడితే అడ్డుకున్నందుకా? సొంత డెయిరీ, పల్ప్ ఫ్యాక్టరీలతో పాడి.. మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించనందుకా? ప్రశాంత నియోజకవర్గాన్ని అరాచకంగా మార్చినందుకా? మీకు మళ్లీ ఎందుకు ఓటేయాలి' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజలు సంధించిన ప్రశ్నలివి.

'స్థానిక' ఎన్నికల్లో అరాచక ఏకగ్రీవాలు



పుంగనూరులో నామినేషన్లు వేయడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో గేట్లు ఎక్కి దిగుతున్న తెలుగు మహిళా నేతలు (ఫైల్ ఫొటో)

2020 మార్చిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు అరాచకానికి పరాకాష్టగా పుంగనూరు చరిత్రలో నిలిచిపోతాయి. నియోజకవర్గంలో ఎక్కడా ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా ఎన్నికల అధికారి కార్యాలయాల్లోనే ఉంటూ వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వీరికి పోలీసులూ సహకరించారు. నామినేషన్ల దాఖలుకు వైసీపీ అభ్యర్థులను మాత్రమే అనుమతించారు. టీడీపీ నేతలు ఆందోళనకు దిగి ధర్నాలు చేశారు. మొత్తంగా నియోజకవర్గంలోని అన్ని సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సహా మున్సిపల్ కౌన్సిలర్లను సైతం ఇలా అధికార బలంతో ఏకగ్రీవం చేసుకున్నారు.

చల్లా బాబు రాకూడదంటూ..

2022 డిసెంబరు 30న సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమానికి వెళ్తున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, పార్టీ శ్రేణులను సోమల దళితవాడ వద్ద దాదాపు 100 మంది వైసీపీ వారు అడ్డుకున్నారు. తమ గ్రామాలకు రాకూడదంటూ రాళ్లదాడితో కారు అద్దాలు పగలగొట్టారు. అక్కడ్నుంచి నంజంపేటకు చేరుకోగా.. అక్కడా అడ్డుపడ్డారు. టీడీపీ శ్రేణులు దీటుగా ఎదుర్కోవడంతో కొన్ని వాహనాలను పంపించేసి.. వెనుక వచ్చిన వాటిపై దాడి చేశారు. ఈ విషయం తెలిసి ముందు వెళ్లిన వాహనాలను ఆపగా, రాళ్లు, కర్రలతో వీరవిహారం చేశారు. పలు కార్లు, జీపులు ధ్వంసం కాగా పలువురికి గాయాలయ్యాయి. వైసీపీ నేతల ఫిర్యాదులతో బాధితులైన టీడీపీ నాయకులపైనే పోలీసులు కేసులు పెట్టారు.

మైనారిటీ యువకులపైనా వేధింపులు

నంజంపేట వద్ద గొడవకు సంబంధించి పుంగనూరు టీడీపీ నేత ఎస్.సుహేల్‌బాషాపై పోలీసులు కేసు పెట్టగా ఆయన హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. దీంతో పోలీసులు మరో కేసులో ఆయన పేరు లేకున్నా ఇతరుల జాబితాలో చేర్చి అరెస్టు చేశారు. పుంగనూరు, రొంపిచెర్లకు చెందిన ముస్లిం యువకులు, విద్యార్థులు, సంఘటనలో లేని 20 మందిని అరెస్టు చేసి పీలేరు సబ్‌జైలుకు రిమాండ్‌కు పంపారు.

- రొంపిచెర్లలో చల్లా బాబు జన్మదినం సందర్భంగా టీడీపీ శ్రేణులు వేసిన ఫ్లెక్సీలను వైసీపీ వారు చించేశారు. దీనిని ప్రశ్నించినందుకు రాళ్లు, సీసాలు, కర్రలతో దాడులకు దిగారు.
- చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డిపై పలుమార్లు వైసీపీ నాయకులు దాడులు చేశారు. ఇటీవల బోయకొండ వద్ద వైసీపీ వారే దాడి చేయగా బాధితుడిపైనే హత్యాయత్న కేసులు పెట్టి జైలుకు పంపారు.

టీడీపీ ఆఫీసు ఖాళీ చేయించి..



పుంగనూరు టీడీపీ కార్యాలయానికి అద్దెకిచ్చిన భవన యజమానికి నోటీసులిప్పించి నిబంధనల పేరుతో కూల్చివేస్తామని యంత్రాలనూ తీసుకొచ్చారు. దీంతో ఆ యజమాని 2022 నవంబరు 11వ తేదీన టీడీపీ కార్యాలయంలోని సామగ్రిని బయట పెట్టించి ఖాళీ చేయించారు.

498 మందిపై హత్యాయత్నం కేసులు

గతేడాది ఆగస్టు 4వ తేదీన మదనపల్లె నుంచి పుంగనూరు మీదుగా చంద్రబాబు పూతలపట్టు వెళ్లాల్సి ఉంది. చంద్రబాబును పుంగనూరులో అడుగు పెట్టనివ్వబోమంటూ టీడీపీ వారిని రెచ్చగొట్టేలా వైసీపీ నేతలు నిరసన ర్యాలీ చేశారు. ఈ క్రమంలోనే పుంగనూరు బైపాస్‌లో పెద్దఎత్తున మోహరించిన పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య తలెత్తిన వాగ్వాదం.. రణరంగానికి దారితీసింది. ఈ ఘటనలో పలువురు టీడీపీ శ్రేణులకు, పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. టీడీపీ అభ్యర్థి చల్లా బాబు సహా 498 మందిపై పోలీసులు హత్యాయత్నం కేసులు పెట్టారు. పలువురిని జైళ్లకు పంపారు. మొత్తం 140 మందిపైన రౌడీషీట్లు తెరిచారు.

టీడీపీ కార్యకర్తల దుస్తులు విప్పించి..

చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు ఆయనకు మద్దతుగా శ్రీకాకుళం టీడీపీ కార్యకర్తలు పుంగనూరు మీదుగా కుప్పానికి సైకిల్ యాత్ర చేశారు. పుంగనూరు మండలం సుగాలిమిట్టలో వైసీపీ నేత, రౌడీషీటర్ చెంగలాపురం సూరి వీరిని అడ్డుకుని బట్టలు విప్పించారు. సైకిళ్లకున్న టీడీపీ జెండాలను తొలగించి, కిందపడేసి తొక్కి దాష్టీకానికి పాల్పడ్డారు.



టార్గెట్ రామచంద్రయాదవ్

- 2020లో సంక్రాంతి కానుకగా నియోజకవర్గ ప్రజలకు చీర, జాకెట్, క్యాలెండర్, డైరీ పంపిణీ చేయాలని రామచంద్రయాదవ్ తెప్పించారు. ఆయా మండలాల పోలీసులు ఈ వాహనాలను సీజ్ చేశారు. చీరల మధ్య కర్ణాటక మద్యం పంపిణీ చేస్తున్నారని కేసులు పెట్టారు.
- పుంగనూరులో 10 వేల మందికి ఉద్యోగాలు ఇప్పించాలని 500 ప్రముఖ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చి రామచంద్రయాదవ్ తన సొంతస్థలంలో మెగా జాబ్ మేళాకు ఏర్పాట్లు చేయగా పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. యువతను వెనక్కి పంపేశారు.
- పాడిరైతులను పెద్దిరెడ్డి దోపిడీ చేస్తున్నారని సదుంలో రైతుభేరి సభకు మూడుసార్లు యాదవ్ ఏర్పాట్లు చేసుకున్నా పోలీసులు అనుమతించలేదు. హైకోర్టు నుంచి అనుమతి తీసుకున్నా శాంతిభద్రతల సమస్య అంటూ అడ్డుకున్నారు.

యాదవ్ ఇంటిపై దాడి



పదేపదే తన సభలను పోలీసులు అడ్డుకోవడంతో పెద్దిరెడ్డిపై రామచంద్రయాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో 2023 డిసెంబరు 4వ తేది రాత్రి ఆయన ఇంటిపై 300 మందికి పైగా చుట్టుముట్టి రాళ్లదాడికి దిగారు. ఫర్నిచర్, ఆరు వాహనాలు, ఆస్తులను ధ్వంసం చేశారు.

బీసీవై నేతను చెప్పుతో కొట్టిన సీఐ



చదళ్లలో బీసీవై పార్టీ ధర్మ పోరాట సభ పెట్టగా ముందురోజే ఏర్పాట్లను పోలీసులు తొలగించారు. యాదవ్‌ను అరెస్టు చేయాలని ప్రయత్నించారు. అనుచరులు అడ్డుకోగా అప్పటి గంగవరం సీఐ కృష్ణప్రసాద్ ఓ నాయకున్ని చెప్పుతో కొట్టారు. పలువురిని అరెస్టు చేశారు.

- పార్టీ వలంటీర్లు, శ్రేణులకు గోడ గడియారాలు, కిట్లు ఇవ్వాలని బిల్లులతో తెప్పించినా పుంగనూరు, తిమ్మికృష్ణాపురంలో ఉన్న గడియారాలను పుంగనూరు, చౌడేపల్లె సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి సీజ్ చేసి కర్ణాటక మద్యం ఉన్నట్లు కేసులు పెట్టారు.
- మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెకు గతనెల 29వ తేది రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. పెద్దిరెడ్డి ఊరికే వస్తావా అంటూ వైసీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో 17 వాహనాలు ధ్వంసం చేసి, ఐదు వాహనాలు దహనం చేసి.. 20 మందిని గాయపరిచారు. రామచంద్రయాదవ్ పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే ఆయనపైకి వైసీపీ శ్రేణులు చొచ్చుకుని వచ్చారు. పోలీసుల ముందే ప్రచార రథాన్ని కాల్చేశారు. ఇక్కడా.. రామచంద్రయాదవ్‌పైనే పోలీసులు హత్యాయత్నం కేసులు పెట్టారు.

బీఎంయూలు మూసేసి..

వైసీపీ రాగానే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జోక్యంతో సోమల, చౌడేపల్లెలోని రెండు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీయూ) మూతపడ్డాయి. ఇప్పుడు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన శివశక్తి డెయిరీ తప్ప ఇతర ప్రైవేటు డెయిరీలు ఏవీ లేవు. ఈ డెయిరీ గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, బయటి డెయిరీ వాహనాలను అనుమతించడం లేదని గతంలో కొందరు రైతులు పాలను కింద పోసి నిరసన కూడా తెలిపారు. ఈ డెయిరీ వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతులు ఆవుల్ని విక్రయించేశారు.

- సదుంలో మంత్రికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్ పల్ప్ ఫ్యాక్టరీలో మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారు. బయటకీ చెప్పలేక రైతులు తమ కష్టానికి ఫలితం లేదని ఆవేదన చెందుతున్నారు.



సోమలలో మూతపడిన బీఎంయూ

ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా


పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లె వద్ద పెద్దిరెడ్డి నిర్మిస్తున్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు ఉల్లంఘించారని.. ప్రాజెక్టుల నిర్మాణం వెంటనే ఆపాలని, రూ.100 కోట్లు జరిమానా చెల్లించాలని ఎన్జీటీ సంచలన తీర్పునిచ్చింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా రూ.25 కోట్లు డిపాజిట్ చేసి పనులు ఆపాలని ఆదేశించింది. ముంపు బాధితులకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వకుండా 80 శాతం పనులు మాత్రం చేశారు.

ఒక్క పరిశ్రమా తేలేకపోయారు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి వైసీపీలో కీలక నేతలు. అదేదీ పుంగనూరు అభివృద్ధిలో కనిపించదు. వీరిద్దరూ కలిసి పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మూడు కంపెనీలకు శంకుస్థాపనలూ చేశారు. కానీ, ఇంతవరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఒక్క పరిశ్రమా రాలేద. వీటికే అతీగతీ లేకుంటే ఎన్నికల ముందు గోపిశెట్టిపల్లెలో పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కుల తయారీతోపాటు అనుబంధంగా 2వేల ఎకరాల్లో పరిశ్రమలంటూ ఎన్నికల ముందు హడావిడి చేశారు. భూములు ఇవ్వడానికి రైతులు నిరాకరించారు. వీరిని నిర్బంధించి మరీ కంపెనీ ప్రతినిధులతో భూపరిశీలన చేయించారు. అక్కడితో ఆ కథ ముగిసింది.

ఏనుగుల నియంత్రణలో విఫలం

చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల మండలాల్లో ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఒక్కోసారి రైతుల ప్రాణాలూ పోతున్నాయి. అటవీశాఖ మంత్రిగా ఉండీ వీటి నియంత్రణకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అడవుల చుట్టూ కందకాలు తవ్వించడం, సోలార్ విద్యుత్ కంచె లాంటివి ఏర్పాటు చేసినట్లయితే వీటి బెడద తప్పేది.



విచ్చలవిడిగా కర్ణాటక మద్యం విక్రయాలు

పుంగనూరు మండలానికి కర్ణాటక సరిహద్దు కేవలం రెండు కిలోమీటర్లలో ఉంది. దీంతో అడ్డూ అదుపు లేకుండా కర్ణాటక మద్యం తరలిస్తూ వైసీపీ నాయకులు రూ.లక్షలు సంపాదిస్తున్నారు. సారా, గంజాయి కూడా లభ్యమవుతోంది. పోలీసులు, ఎస్ఈబీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు.

- పెద్దిరెడ్డి అనుచరులు ఇష్టారాజ్యంగా చెరువుల్లో మట్టి తవ్వేస్తున్నారు. లోయలను తలపించే చెరువులతో తమకు నష్టమని రైతులు అడ్డుకున్నా.. నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోలేదు. ఇక గుట్టలనూ తవ్వి మట్టి తరలిస్తున్నారు. ఈ తవ్వకాలకు అనుమతి లేదని వివరణ ఇచ్చే అధికారులు.. వాటిని ఆపింది లేదు.

● అట్టుంటది మాతోని

మీకెట్టా ఇస్తారో నేను జూడనా!



'నీకిచ్చినారా.. అయితే మేమేం జేసినాం? నీగ్గూడా ఎట్టా దక్కతాదో జూస్తాం..' అంటా రగిలిపోతా వుండారు కుప్పం ఓటర్లు. 'నాకు దక్కకుంటే పీడాపాయ. నీకుమాత్రం దక్కనియ్యనుగాక.. దక్కనియ్యను' అని శపథం చేసి మరీ తీసుకున్నోల్లను, అధికార పార్టీవోల్లను రచ్చకీడస్తావుండారు. బుదారం రేత్తిరి కుప్పం మున్సిపాలిటీలో అధికార పార్టీవోల్లు ఓటర్లకు తలా నాలుగు ఎయ్యిలు పంచకుంటా వొచ్చినారు. అదీ ఓల్లకు అనుకూలమైన యాపై శాతం మందికే పంచాలని పెద్ద నాయకులు రూలు పెట్టినారంట. అందుకని ఒకింటికి పంచితే, ఆ పక్కింటికి కాసులు అందలా. ఒకాయమ్మ ఒడిలో కాసులు నిండితే, ఇంకొకాయమ్మకు ఒట్టిచెయ్యి చూపతా వొచ్చినారంట. అంతా బాగానే జరిగింది కానీ, భైరుగానిపల్లి దెగ్గిరికి వొచ్చేసరికి ఈ యాపై శాతం మందికి పంపిణీ కత తిరగబడింది. అక్కడ ఒకే కుటుంబరానికి చెందిన మూడునాలుగుమంది మనుషులు పెళ్లిళ్ల పేరంటాళ్ల చేసుకోని ఏరేపొయ్యి మూడునాలుగు ఇళ్లల్లో కాపురాలు జేస్తావుండారంట. ఆ ఇళ్లల్లో ఒకింటికాడికి ఎల్లిన అధికార పార్టీ మనుషులు, ఓటరుకు నాలుగు ఎయ్యిలు వొంతున కాసులు పంచినారంట. ఆ పక్కింటోల్లు చూస్తానే ఉండారుగానీ, ఒక్క పైసా గూడా ఇదల్చలేదంట. అప్పుటికీ ఆ ఇంటోల్లు నోరిడిసి అడిగినారంట గూడా.. 'మాకేయి సామీ కాసుల'ని. 'లేదు.. మీకిచ్చేకి మావల్ల గాదు. మేమియ్య..' అని పంపకాలోల్లు మూటలు ఎనక్కి దాచుకున్నారంట. ఇంకేముండాది. అగ్గిమీద గుగ్గిలమైపొయ్యినారు పక్కింటోల్లు. ప్రెచారంలో తిరగతా వుండే ప్రెతిపచ్చమోల్లకు ఆడినింకానే ఫోన్లు కొట్టినారు. 'మీరేం మనుషులప్పా.. ఇక్కడ అధికార పార్టీవోల్లు కాసులు పంచేస్తావుంటే అక్కడ ఎర్రోల్లలా ఉత్తి చేతులతో తిరిగతా వుండారు? రాండి.. రాండి వొచ్చి ఈ కాసుల పంపకాలను అడ్డుకోండి' అంటూ కొంపలు మునిగిపోయేటట్టు చెప్పినారంట. ఇదేదో తేడాగా ఉండాదని, ఆ పంపకాల గుంపు నాయకుడు బైపాస్ రోడ్డులోని బాబునగర్‌కు చెందిన తన మనుషులను ఒగ యాపైమందిదాకా పిలిపించేసినాడంట. ఒకేల ప్రెతిపెచ్చమోల్లు గొడవకు దిగితే, తొడగొట్టి బరిలో దూకడానికి తయారైపొయ్యినారంట. మజ్జలో ఓల్ల పార్టీ నాయకులనింకా ఫోన్లు వొచ్చినాయి. 'ఒరేప్పా.. ఇది మన టైం గాదురాప్పా. ప్రెతిపెచ్చమోల్లకు మీరు కాసుల మూటలతో దొరికినారంటే పెంటపెంట చేసేస్తారు. వోల్లొచ్చే లోపల మీరు బిరీన లగెత్తుకోని ఆడినింకా పారిపోండి.' అని ఆ ఫోను కొట్టిన నాయకులు సలహా ఇచ్చినారంట. అంతే.. ప్రెతిపెచ్చమోల్లు వొచ్చేసరికి అక్కడ ఒక్క పిట్ట ఉంటే ఒట్టు. 'గడపదాకా వొచ్చిన కాసులకు మోకాలడ్డినారు గదే. మీ కాపురాలు గూలా?' అంటా మొదటింటోల్లు మెటికలు ఇరస్తావుండారంట. - కుప్పం

● ఇదీ సంగతి

సినిమా షో.. రద్దు



ఎన్నికల ప్రభావం సినిమా థియేటర్ల మీద స్పష్టంగా కనిపిస్తోంది. ప్రేక్షకులులేక గురువారం చిత్తూరు నగరంలోని కొన్ని థియేటర్లలో మార్నింగ్ షోలను రద్దు చేశారు. ఎన్నికలయ్యే వరకు పెద్ద హీరోల సినిమాలను విడుదల చేయకుండా వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా థియేటర్లలో చిన్న హీరోల సినిమాలు నడుస్తున్నాయి. పోలింగ్ తేది సమీపిస్తుండటం.. చాలామంది ప్రచారాల్లో బిజీగా ఉండటంతో థియేటర్లకు వచ్చేవారు లేకుండా పోయారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'వైసీపీ మళ్లీ వస్తే చిత్తూరు ప్రజలు ప్రశాంతత కోల్పోతారు. అరాచకం మళ్లీ మొదలవుతుంది. అభివృద్ధి కావాలంటే టీడీపీ రావాల్సిందే. ప్రజలకు ఏది కావాలో వాళ్లే నిర్ణయించుకోవాలి. చిత్తూరులో విజయానందరెడ్డి అనుచరులు చేస్తున్న అసాంఘిక కార్యకలాపాలను ప్రక్షాళన చేస్తాను. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రచించాను'అని చిత్తూరు టీడీపీ కూటమి అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచార తీరు, క్షేత్ర స్థాయిలో లభిస్తున్న ఆదరణ, స్థానికంగా వైసీపీ అరాచకాల గురించి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ప్రత్యేకంగా మాట్లాడారు.

- చిత్తూరు సిటీ, చిత్తూరు రూరల్


మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

అరాచకం కావాలా.. అభివృద్ధి కావాలా ?

- చిత్తూరు ప్రజలు నిర్ణయించుకోవాలి
- వైసీపీతో మళ్లీ రౌడీయిజం, భూదందాలు
- ప్రశాంత చిత్తూరే నా లక్ష్యం
- విజయానందరెడ్డిపై కేసులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిందే
- ఎర్రచందనం స్మగ్లర్ అని అఫిడవిట్లోనే అంగీకరించారు
- చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఇంటర్వ్యూ

● విజయానందరెడ్డిని విమర్శించేందుకు ఇష్టం, సమయం లేదు

విజయానందరెడ్డి అధికారం లేనప్పుడే ఎర్రచందనం అక్రమ రవాణాను ఎంచుకున్నారు. 2004 నుంచి అతనిపై కేసులున్నాయి. అప్పుడు టీడీపీ అధికారంలో లేదు. అతను మాకు శత్రువు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కేసులు పెట్టారు. ఒకట్రెండు కాదు ఏకంగా 12 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులున్నాయి. కల్తీ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన కేసు కూడా ఒకటి ఉంది. అతన్ని విమర్శించేందుకు నాకు ఇష్టం లేదు. సమయం లేదు. ఆ సమయంలో నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలని ఆలోచిస్తాను. నా జీవితంలో నేను ఒక్కసారి కూడా జైలుకు వెళ్లలేదు.

● 21 ఏళ్ల నుంచే ట్యాక్స్ కడుతూ సక్రమమైన వ్యాపారాలు చేశా..

ఒక బిల్డర్‌గా విదేశాలు తిరిగి అక్కడి నిర్మాణాలు, పరిస్థితులు, అభివృద్ధి గురించి పూర్తి అవగాహన తెచ్చుకున్నాను. ఆ పరిజ్ఞానంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాను. 21 ఏళ్ల వయసు నుంచే ట్యాక్స్ చెల్లించే వ్యాపారాలు చేశానే తప్పా అక్రమ వ్యాపారాలు చేయలేదు. పదే పదే నేను పేదవాడ్ని అని చెప్పుకునే ఈయనకు ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు తెలుసు.

● కష్టపడిన సొమ్ముతోనే దానం చేయాలి

ప్రకాశం జిల్లాలో అప్పట్లో స్టూవర్టుపురం అని ఉండేది. అక్కడి దొంగలు దొంగతనం చేసి ఇతర ప్రాంతాల్లో దానం చేస్తుంటారు. దానం చేయాలంటే కష్టపడిన సొమ్మును ఇవ్వాలి. అవినీతి సొమ్మును దానం చేసినా ఫలితం ఉండదు.

● విజయానందరెడ్డితో నాకు విబేధాల్లేవు

నాకు విజయానందరెడ్డితో రాజకీయం తప్పా ఎలాంటి వేరే విబేధాలు లేవు. అతను అఫిడవిట్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా చేసినట్లు ఒప్పుకున్నారు. ఆ కేసులు నేను పెట్టించింది కాదు కదా. రాజకీయ నాయకుల మీద రాజకీయ పరంగా కేసులుంటే తప్పు లేదు. అక్రమ, అవినీతి కేసులు ఉండకూడదు.

● అసాంఘిక కార్యకలాపాలన్నీ ఆయన అనుచరులవే

ఇక్కడి ఎమ్మెల్యేని డమ్మీని చేసి ఐదేళ్లు రాజ్యమేలారు. లాటరీ, పేకాట, మట్కా, మాదక ద్రవ్యాలన్నీ అతని అనుచరులు అమ్ముతున్నారు. అధికార పార్టీ నాయకుడు అయి ఉండీ ఎందుకు ఇలాంటి కార్యక్రమాల్ని ఆపలేకపోయారు. ఆయన అనుచరులు చేసిన అరాచకాల గురించి నగరంలో అందరికీ తెలుసు. ముందున్న ఎమ్మెల్యే ఇవన్నీ చేశాడని వాదిస్తే.. మరి నువ్వు ఎందుకు అడ్డుకోలేదనే ప్రశ్న తెరపైకి వస్తుంది కదా.

● అనుచరులతోనే అతనికి పెనుప్రమాదం

విజయా నందరెడ్డికి అనుచరులు అనే అంశమే పెను ప్రమాదంగా మారింది. తన చుట్టూ ఉన్న అనుచరుల తీరు వల్లే తను చేసిన సేవను కూడా మర్చిపోయేలా పరిస్థితులున్నాయి.

● మా వాళ్లను బెదిరిస్తున్నారు

'జూన్ 4 తర్వాత నువ్వు ఎక్కడుంటావు.. వాళ్లకి మీటింగ్‌కు స్థలం ఇస్తావా.. చౌల్ట్రీ అద్దెకిస్తావా..' అని విజయానందరెడ్డి మా వాళ్లను బెదిరించారు. అవన్నీ సేవ్ చేసుకుని పెట్టుకున్నాం. సందర్భం వచ్చినప్పుడు వాటి గురించి మాట్లాతాను.

● ఇక్కడి శక్తుల్ని ఎదుర్కొంటాను

బ్రిటీష్ వాళ్లను సామాన్య వ్యక్తి గాంధీ ఎదురొడ్డి పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు కదా. అలాగే ఇక్కడి శక్తులను నేను ఎదుర్కొని చిత్తూరుకు స్వాతంత్ర్యం తెస్తాను.

● పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారుల తీరు దారుణం

ఎవరు అధికారంలో ఉండే వారికి వత్తాసు పలకడం అధికారుల తీరు. వైసీపీ ప్రభుత్వంలో కొంత మంది అధికారులు వారి ఇంట్లో మనిషిలా పనిచేస్తున్నారు. చిత్తూరులో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తీరు దారుణంగా ఉంది. మా కేసుల్ని తీసుకోరు. వారి పెడితే వెంటనే తీసుకుని మా వాళ్లను లోపలేస్తున్నారు.

● దౌర్జన్యాలు జరిగే పోలింగ్ కేంద్రాల్ని గుర్తించాం

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ వాళ్లు దౌర్జన్యాలు చేస్తారని గుర్తించాం. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక భద్రత కోసం జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారుల్ని కోరాం.

● అంతమంది నాతో ఉన్నారంటే నేనేంటో తెలుస్తోంది

చిత్తూరును పరిపాలించిన ఏడు కుటుంబాలు నాతోనే ఉన్నాయి. చిత్తూరు తొలి ఎమ్మెల్యే చెరుకూరి దొరస్వామి నాయుడు (సీడీ నాయుడు) మనవడు వసంత్‌కుమార్, మరో ఎమ్మెల్యే ఆంజనేయులు నాయుడి కుమారుడు గుడిపాల బాలాజీ, నలగాంపల్లె కుటుంబం (నాయుడు బిల్డింగ్స్)లోని మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీ వెంకటేశ్వరి చౌదరి, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, నియోజకవర్గాన్ని దశాబ్దాల పాటు పాలించిన సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఆదికేశవులు కుటుంబం, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, ఆరణి శ్రీనివాసులు, జడ్పీ మాజీ చైర్మన్ గీర్వాణి చంద్రప్రకాష్ దంపతులు, కఠారి హేమలత.. ఇలా అందరూ నాతోనే ఉన్నారు. వీళ్లే కాకుండా పక్క నియోజకవర్గంలో పనిచేసిన ఆర్.గాంధీ కూడా నా కోసం పనిచేస్తున్నారు. ఎవరికివారు వారి స్థాయిలో కష్టపడుతున్నారు. ఇంత మంది ఓ వ్యక్తికి మద్దతు పలుకుతున్నారంటే ఆ వ్యక్తి క్యారెక్టర్ ఏంటో ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీ అభ్యర్థితోపాటు రౌడీలు, గూండాలు ఉన్నారు.

● చివరి సభ చిత్తూరులో..

ప్రజాగళం పేరిట మా అధినేత చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం ముగిసే చివరి రోజు ఈ నెల 11న చిత్తూరులో సభ నిర్వహించి ప్రచార కార్యక్రమాల్ని ముగిస్తారు. మెసానికల్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

● ఆ జగన్ ఇంటికి.. ఈ జగన్ అసెంబ్లీకి..

జూన్ 4న ఒక జగన్‌మోహన్‌ను రాష్ట్ర ప్రజలు ఇంటికి పంపిస్తారు. మరో జగన్మోహన్‌ను చిత్తూరు ప్రజలు అసెంబ్లీకి పంపిస్తారు. చిత్తూరు జగన్మోహన్ అసెంబ్లీకి వెళ్లిన రోజే కడప జగన్మోహన్ ఇంటికి వెళ్తారు. ఇది ఖాయం.

● రంజాన్ రోజున నేను విజ్ఞతతో వ్యవహరించా..

రంజాన్ రోజున ముస్లిం సోదరులు ఈద్గాకు ఇరు వర్గాలన్నీ ఆహ్వానించారు. పాలకపక్షంలో ఉన్నవారు తొలుత మాట్లాడి విష్ చేయడంలో తప్పు లేదు. ప్రతిపక్షంలో ఉన్న మాకు రెండోసారి అవకాశం ఇస్తారు. అతను రాజకీయ ప్రసంగాలు చేసి మైకును తీసుకెళ్లిపోయారు. అలాంటి తీరును వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. నేను అక్కడి నుంచి మౌనంగా వెనక్కి వచ్చేశాను. ప్రజలు తీర్పు చెప్తారు. ఎదుటి వ్యక్తిని గౌరవించడం తెలియని వ్యక్తి పాలనలో ప్రజలు బానిసలవుతారు.



● నేను వారంలోనే అన్నీ బంద్

విజయానందరెడ్డి అనుచరులు నిర్వహిస్తున్న లాటరీ, పేకాట, మట్కా వంటి అన్ని రకాల అసాంఘిక కార్యకలాపాలను నేను గెలిచిన వారంలోనే బంద్ చేస్తాను. అదే నా తొలి ప్రాధాన్యత. అలాంటి వాటి నుంచి మాకు ఆదాయాలు వద్దు.

● వైసీపీ అంటే ప్రజలు భయపడుతున్నారు

ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రజలు ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. వైసీపీ అంటే భయపడుతున్న విషయం అర్థమవుతోంది. పోలింగ్ రోజున వారేంటో తెలియజేస్తారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు : చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో జూన్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7799933370 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుందాం

నందమూరి రామకృష్ణ


రోడ్‌షోలో పాల్గొన్న రామకృష్ణ, మురళీమోహన్

తవణంపల్లె, మే 9: వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకొందామని నందమూరి రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని అరగొండలో జరిగిన ఏన్నికల ప్రచారంలో పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరగొండలో మాజీ వైస్ సర్పంచ్ మునీశ్వర్‌రెడ్డి కుటుంబం టీడీపీలో చేరింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో సుపరి పాలన కావాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అలాగే కూటమి అభ్యర్థులు మురళీ మోహన్, ప్రసాద్ రావులను గెలిపించాలన్నారు. అనంతరం అరగొండలో రోడ్ షో నిర్వహించి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, మండల గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, మాజీ ఎంపీపీ సరళకుమారి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, నాయకులు మధు, పరంధామనాయుడు, సునీల్, రంజిత్, విజయ్ యాదవ్, మోహన్, చిన్నాతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన మిడారిమిట్ట దళితులు

పూతలపట్టు : మండలంలోని తేనేపల్లి, తిమ్మిరెడ్డిపల్లి, గాండ్లపల్లి తదితర గ్రామపంచాయతీల్లో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న మిడారిమిట్ట దళితవాడ ప్రజలు టీడీపీలో చేరడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు యువరాజు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, హిమగిరి నాయుడు, చంద్రమౌళి, చిరంజీవి, జయచంద్ర నాయుడు, సంపత్ నాయుడు, రెడ్డెప్ప నాయుడు, రవి, తేనేపల్లి పంచాయతీ, రంగంపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులను దోచుకునేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు : టీడీపీ

గంగాధరనెల్లూరు, మే 9: ప్రజల ఆస్తులను దోచుకునేందుకే వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును ప్రవేశపెట్టిందని జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం ధ్వజమెత్తారు. టీడీపీ ఎమ్మెల్యే, పార్లమెంట్ అభ్యర్థులు డాక్టర్ థామస్, దగ్గుమల్ల ప్రసాదరావులను సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరుతూ పలువురు నేతలు వేల్కూరు పంచాయతీలో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంచిపెట్టి అభ్యర్థించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్తులను సైతం అక్రమంగా ఆక్రమించుకోవడానికి ఈ చట్టం అమల్లోకి తెచ్చినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నేతలు మన్నారయ్య యాదవ్, కేతినేని లోకేష్‌నాయుడు, జ్యోతి రెడ్డి, లోకనాథం, కన్నియప్పన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకే తొలి ప్రాధాన్యత

గురజాల జగన్మోహన్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల జగన్మోహన్, టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గురజాల

చిత్తూరు సిటీ, మే9: ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిత్తూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకే తొలి ప్రాధాన్యత ఇస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. గురువారం నగరంలోని 29వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురజాల సమక్షంలో సుమారు 100 మందికిపైగా వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. స్థానికులు తమ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్యను వివరించారు. స్పందించిన గురజాల పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు ముద్రించి తనను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, నేతలు నరేష్, వినోద్, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ చిత్తూరు రూరల్ మండలం ఏనుగుండ్లపల్లె, నగరంలోని జీకే నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగనోహ్మన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును గెలిపించాలని కోరారు.
- మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆయన కుమారుడు సీకే సాయికృష్ణా రెడ్డి, గురజాల చెన్నకేశవులు నాయుడు స్థానిక 25,32 డివిజన్లలో ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

100 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

చిత్తూరు రూరల్ : వెంకటాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సురేష్‌తోపాటు అతడి అనుచరులు 100 మందికిపైగా గురజాల జగన్మోహన్ నివాసంలో పార్టీలో చేరారు.

జీడీనెల్లూరులో మహిళా ఓటర్లే అధికం

మొత్తం ఓటర్లు 204949 ● పురుష ఓటర్ల సంఖ్య 101853
మహిళా ఓటర్లు 103090 ● ట్రాన్స్‌జెండర్స్ 6

వెదురుకుప్పం,మే9: గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 204949 మంది ఓటర్లు ఉండగా పురుషుల ఓటర్లు 101853, మహిళా ఓటర్లు 103090 మంది ఉన్నారు. మహిళా ఓటర్లే 1237 మంది అధికం. ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఆరుగురు ఉన్నారు. కాగా, సర్వీసు ఓటర్లు 475 మందిలో పురుషులు 466, మహిళలు 9 మంది ఉన్నారు. పీడబ్ల్యుడీ ఓటర్లు 3582 మంది. వీరిలో 2126 మంది పురుషులు, 1456 మంది మహిళలు. 18-19ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 5094మంది. వీరిలో పురుషులు 2841 మంది, మహిళలు 2253 మంది ఉన్నారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 951 మంది ఉండగా వీరిలో పురుషులు 373, స్త్రీలు 578 మంది ఉన్నారు. ఓవర్‌సీస్ (ఎన్ఆర్ఐ) ఓటర్లు 13 మంది ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సీఎం కావాలి



నలగాంపల్లెలో మాట్లాడుతున్న మురళీమోహన్, హాజరైన మహిళలు

బంగారుపాళ్యం, మే 9: రాష్ట్ర భవిష్యత్తు వెలగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని నలగాంపల్లె పంచాయతీ, పీడీపీ కండ్రిగ, కేసీ కండ్రిగ, ఎన్‌పీ నగర్, మడిపోలూరు, దామరాకుల ఒడ్డు, మల్లేశ్వరం గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నలగాంపల్లెలో మురళీ మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి దగ్గుమళ్ళ ప్రసాదరావు, మురళీమోహన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీ దుర్గా రామక్రిష్ణ, ఎన్‌పీ జయచంద్రనాయుడు, ఎన్‌పీ సురేంద్ర నాయుడు, ఎన్‌పీ వెంకట్, ఎన్‌పీ విక్రమ్, ఎన్‌పీ రంజన్, ఎన్‌పీ ధరణీనాయుడు, ఎన్‌పీ నవీన్ చౌదరి, ఎన్‌పీ శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ షీబా స్వామిదాస్, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, మాజీ ఎంపీటీసీ గిరిబాబు సుజాత, దొరస్వామి నాయుడు, జనార్దన్ గౌడ్, నాగరాజ్ గౌడ్, రామభద్రనాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

మరమగ్గాలకు పూర్వ వైభవం తెస్తా

నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్


నగరి కొత్తపేటలో ప్రచారం చేస్తున్న భానుప్రకాష్

నగరి మే 9: మరమగ్గ కార్మికులకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి కొత్తపేటలో బుధవారం సాయంత్రం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముద్దుకృష్ణమనాయుడు కొడుకుగా మీ ముందుకు వచ్చా... నన్ను ఆశీర్వదించి సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అలాగే :నగరి పట్టణం తలారి వీధికి చెందిన వైసీపీ యువత టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చక్రపాణిరెడ్డి, బాలగోపాల్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర : మండలంలోని జీఎన్‌కండ్రిగ, నిండ్ర, కొప్పేడు, ఎలకాటూరు పంచాయతీలలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డితో కలిసి గాలి భానుప్రకాష్ ప్రచారం నిర్వహించారు. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ మంత్రి రోజా, ఆమె కుటుంబసభ్యుల నుంచి నియోజకవర్గాన్ని కాపాడుకోవాలని, గాలి భానుప్రకాష్‌కు అండగా నిలిచి, రోజా ఓడించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, నాయకులు భాస్కర్‌రెడ్డి, ధనంజయనాయుడు, పెరుమాల్‌రెడ్డి, పరదేశి, ఎబిరాజ్, చిట్టిబాబు, రవినాయుడు, మురళీనాయుడు, జయచంద్రారెడ్డి, గోపీనాయుడు, జయమ్మ, సంపూర్ణమ్మ, మనోమర్‌నాయుడు, తేజేష్ విజయ కుమార్, గాలి రమేష్ నాయుడు, సురేష్ రఘురాం, గిరిబాబు, మోహన్ రెడ్డి, కుప్పా రెడ్డి, నరసింహులు, నాగవేల్ రెడ్డి, నాగులయ్య సంజీవి, వేదాచలం తదితరులు పాల్గొన్నారు.


నిండ్రలో ప్రచారం నిర్వహిస్తున్న భాను ప్రకాష్

టీడీపీ నేత హాస్పిటల్ ఎదుట
వైసీపీ కార్యకర్తల వీరంగం


బ్యారికేడ్లను పడదోస్తున్న అధికార పార్టీ కార్యకర్త

కుప్పం, మే 9: టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబుకు చెందిన నర్సింగ్ హోమ్ ఎదుట గురువారం వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించాయి. కుప్పం-పలమనేరు బైపాస్ రోడ్డులో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఈ నర్సింగ్ హోమ్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా బారికేడ్స్ పెట్టారు. మధ్యాహ్నం పైన కుప్పం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌కి వెళ్లారు. ఆయన వెంట వెళ్లిన కొంతమంది వైసీపీ నాయకులు కొంతసేపటి తర్వాత సురేశ్‌బాబు నర్సింగ్ హోమ్ వద్దకు చేరుకుని దుర్భాషలాడుతూ అక్కడున్న బారికేడ్లను పడదోసి, తొక్కుతూ వీరంగం సృష్టించారు. ఆ సమయంలో నర్సింగ్ హోమ్‌కు వచ్చిన రోగులు భయభ్రాంతులకు గురయ్యారు.

60 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 9: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మకంగా గుర్తించిన 60 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి అన్ని కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం సాయంత్రం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో బీఎల్వోలతో ఆయన సమీక్షించారు. ఆదివారం సాయంత్రంలోగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పులు అందలేదనే ఫిర్యాదులు వస్తే సంబంధిత బీఎల్వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లకు ఎన్నికల విధులపై అవగాహన


ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన కల్పిస్తున్న ప్రొబేషనరీ డీఎస్పీ పావన్‌కుమార్

చిత్తూరు, మే 9: కొత్తగా జిల్లాకు వచ్చిన ట్రైనీ ఐపీఎస్ అధికారులకు ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన విధి విధానాలు, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ప్రొబేషనరీ డీఎస్పీ పావన్‌కుమార్ అవగాహన కల్పించారు. గురువారం స్థానిక పోలీసు అతిథిగృహంలో చేపట్టిన కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఈవీఎంలకు గట్టి భద్రత


కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 9: పోలింగ్ అనంతరం నియోజకవర్గాల నుంచి తరలివచ్చే ఈవీఎంలను భద్రపరిచే అంశంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. గురువారం రాత్రి ఓట్ల లెక్కింపు కోసం ఎంపిక చేసిన శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్వీసెట్‌లో నియోజకవర్గాలవారీగా ఏర్పాటు చేయనున్న రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన చిత్తూరు ఆర్డీవో జి.చిన్నయ్యతో కలిసి పరిశీలించారు. వారి వెంట పలు విభాగాల అధికారులు ఉన్నారు.

14 నుంచి గంగజాతర


మీడియాతో మాట్లాడుతున్న ఉత్సవ ధర్మకర్తలు

చిత్తూరు కల్చరల్, మే 9: నగరంలో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు నడివీధి గంగమ్మజాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే లావణ్యబాబు తెలిపారు. గురువారం తన నివాసంలో ఉత్సవ నిర్వాహకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ 14న చాటింపు, 15 నుంచి 20 వరకు అమ్మవారికి భక్తులు పొంగళ్లు, తోటివేషాలు, దీపారాధనలు ఉంటాయని వివరించారు. ఎన్నికల కారణంగా ఈ సంవత్సరం జాతరను 21, 22 తేదీలకు మార్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో గుణశేఖర్, వెంకటేష్, హేమంత్‌కుమార్, సత్య, పొన్నియమ్మగుడి అర్చకులు కేదారేశ్వర స్వామి పాల్గొన్నారు.

నేటిలోగా పోలింగ్ పాఠశాలలను అప్పగించండి

● ఎంఈవోలకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 9: పోలింగ్ నిర్వహణ కోసం గుర్తించిన అన్ని మేనేజ్‌మెంట్లలోని పాఠశాలలను శుక్రవారం లోగా సెక్టోరల్ అధికారులకు అప్పగించాలని ఎంఈవోలను జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈవోలతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలలను శుభ్రపరచి, ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఒకే పాఠశాల ప్రాంగణంలో ఉంటే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ (మైక్)ను అందుబాటులో ఉంచాలన్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, సమగ్రశిక్షా ఏపీసీ వెంకట్రమణారెడ్డి, డీఈవో దేవరాజులు పాల్గొన్నారు.

నేడు పుత్తూరుకు జగన్

పుత్తూరు అర్బన్, మే 9: సీఎం జగన్ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు పుత్తూరులో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభకు హాజరు కానున్నారు. పట్టణంలోని కాపువీధి జంక్షన్ వద్ద సభ జరిగే ప్రదేశాన్ని ఎస్పీ విక్రమ్ పాటిల్ గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు.ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జగన్ దిగేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు.జగన్ సభ విజయవంతం చేసేందుకు నగరి నుంచే కాకుండా సత్యవేడు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల నుంచి కూడా వైసీపీ నేతలు జనసమీకరణ చేస్తున్నట్లు తెలిసింది.

10 నుంచి రామానుజ అవతార ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), మే 9: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8.30 వరకు సాహిత్య, సంగీత సభలు జరుగుతాయి. తొలి రోజు మే 10న సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయరు స్వామి, చినజీయరు స్వామి మంగళాశాసనంతో కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య చక్రవర్తి రంగనాథన్.. రామానుజ వైభవంపై ప్రసంగిస్తారు. తరువాత రేవతి బృందం భక్తి సంగీత విభావరి ఉంటుంది.

20వేల ఓటరు స్లిప్పుల గల్లంతు?

విచారణకు ఆదేశించిన కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), మే 9 : తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 20వేల ఓటరు స్లిప్పులు గురువారం గల్లంతైనట్లు సమాచారం.తిరుపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం బుధవారం ముగిసింది.పంపిణీ కాకుండా మిగిలిన ఓటరు స్లిప్పులను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బీఎల్వోలు సమర్పించాలి. ఇలా సమర్పించిన 60 వేల ఓటరు స్లిప్పుల్లో 20వేల దాకా గల్లంతైనట్లు తెలియడంతో అప్రమత్తమైన రిటర్నింగ్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.ఈ విషయమై తిరుపతి అర్బన్ తహసిల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా 20 వేల ఓటరు స్లిప్పులు గల్లంతు కాలేదని, ఓ బీఎల్వో వద్ద వున్న 70 ఓటరు స్లిప్పులను గుర్తు తెలియని వ్యక్తులు బయట పారేశారన్నారు.వాటిని తిరిగి తెచ్చి భద్రపరిచారన్నారు.

56వేల ఓటర్ స్లిప్పులను బయటపెట్టాలి

ఆరణి శ్రీనివాసులు డిమాండ్

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో పంపిణీ చేయకుండా వెనక్కి వచ్చిన 56వేల ఓటర్ స్లిప్పులను వెంటనే బహిర్గతం చేయాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మార్చినెలలో ప్రస్తుత ఆర్వోనే కార్పొరేషన్ కమిషనర్‌గా, ఇదే బీఎల్వోలు పనిచేశారని గుర్తుచేశారు. కేవలం వైసీపీకి అధికారులు కొమ్ముకాయడం వల్లే 56వేల ఓటర్ స్లిప్పులు వెనక్కి వచ్చాయని మండిపడ్డారు. వెనక్కి వచ్చినవన్నీ దొంగ ఓటర్లవేనని, ఆ లిస్టును బహిరంగ పరచాలని కోరారు. ఎన్నికల సంఘం ఫిబ్రవరి, మార్చిలోపు దొంగ ఓట్ల తొలగింపునకు అవకాశం ఇచ్చినా అధికారులు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. దేశంలోనే 16 అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటిగా ఉన్న తిరుపతిలో గత ఎన్నికల్లోనే 174 పోలింగ్ కేంద్రాల్లో బలగాలను నియమిస్తే, ప్రస్తుతం కేవలం 40 కేంద్రాల్లోనే బలగాలను ఏర్పాటు చేయడం వైసీపీకి మేలు చేయడానికేనని ఆరోపించారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు స్పందించి, తిరుపతిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మొహరింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు కోసం
ప్రచారం చేయడం గర్వంగా ఉంది

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామ్‌దాస్



అభివాదం చేస్తున్న అన్బుమణి రామ్‌దాస్ - హాజరైన వన్నెకుల క్షత్రియ కులస్తులు

కుప్పం, మే 9: విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు కోసం ప్రచారం చేయడం గర్వంగా ఉందని తమిళనాడుకు చెందిన పీకేఎం (పట్టాలి మక్కల్ కచ్చి) అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రామ్‌దాస్ అన్నారు. కుప్పం టీడీపీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ కులస్తుల సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. తమిళనాడులో రామ్‌దాస్‌పురం లాగా ఒకప్పుడు కుప్పం పనిష్మెంట్ ఏరియాగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. అటువంటి ప్రాంతాన్ని సకల రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన్ను లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ చిత్తూరు ఎంపీ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్.రాజన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దారుణంగా నష్టపోయిందన్నారు. వన్నెకుల క్షత్రియుల్లో వెనుకబాటు ఉందని, చంద్రబాబు పాలనలో వారి కోసం అనేక పథకాలు అమలు చేసి, ఆదుకున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును, చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబులు మాట్లాడుతూ కుప్పం ప్రజలు ఓటేయబోయేది కాబోయే ముఖ్యమంత్రికి అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ టీడీపీని గెలిపించడం ద్వారా వన్నెకుల క్షత్రియులు వారి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలని కోరారు. కుప్పం మాజీ ఎంపీపీ సాంబశివం, నాలుగు మండలాల వన్నెకుల క్షత్రియ కులస్తుల అధ్యక్షులు, ఇతర నాయకులు మాట్లాడారు.

గోవిందరాజ స్వామి ఆలయంలో
కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(కల్చరల్) మే 9: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయంలో మే 16 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని సంప్రదాయరీతిలో వివిధ పరిమళద్రవ్యాలతో శుద్ధిచేశారు. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, అర్చక బృందం పాల్గొన్నారు.

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కల్చరల్), మే 9: తిరుపతిలో టీటీడీకి చెందిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి ఈనెల 25వ తేదీనుంచి దరఖాస్తులు ఇవ్వనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 12వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని టీటీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సంగీత, నృత్య కళాశాలలో.. గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ, మృదంగం, డోలు, ఘటం విభాగాల్లో విశారద(ఫుల్‌టైం), ప్రవీణ (డిప్లొమో) కోర్సులున్నాయి.

నాదస్వర, డోలు పాఠశాలలో..

నాదస్వర, డోలు పాఠశాలలో ఫుల్ టైం సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులున్నాయి. బయటి ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంది. కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. పూర్తి వివరాలకు 0877-2264597, 73308 11173, 98483 74408, 94407 93205 నెంబర్లను సంప్రదించాలి.

తగ్గిన ఎండవేడిమి

చిత్తూరు కలెక్టరేట్, మే 9: జిల్లాలో నాలుగైదు రోజులుగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో ఎండవేడిమి కాస్త తగ్గింది. మండుతున్న ఎండలతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి ఉపశమనం లభించింది. మే నెలలో జిల్లావ్యాప్తంగా 67.2 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, గురువారం వరకు 46.6 మి.మీ నమోదైంది. గత నెల రోజులుగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీలు నమోదయ్యాయి. గురువారం అన్ని మండలాల్లో 39 డిగ్రీల్లోపు నమోదైంది. చిత్తూరులో 38.4, గుడిపాల 38.4, తవణంపల్లెలో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, మిగిలిన మండలాల్లో అంతకులోపు నమోదైంది.

దద్దమ్మ పాలనకు చరమగీతం పాడండి

ఐదేళ్లుగా కుంభకర్ణుడి నిద్రలో వైసీపీ ప్రభుత్వం - సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు

మాజీ మంత్రి అమరనాథరెడ్డి - వి.కోట రోడ్‌షోలో పోటెత్తిన పసుపుసైన్యం



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న అమరనాథరెడ్డి - ర్యాలీలో పాల్గొన్న పసుపు దండు, జనసైనికులు

వి.కోట, మే 9: అమరావతిని ఆపేసి మూడు రాజధానులంటూ అందరినీ మోసం చేసిన వైసీపీ దద్దమ్మ పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వి.కోటలో టీడీపీ రోడ్‌షో, ర్యాలీ నిర్వహించింది. మార్కెట్ యార్డు నుంచి ఎంజీ రోడ్డు మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలసి అమరనాథరెడ్డి ఈ ర్యాలీలో పాల్గొనగా గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. స్థానిక కేసీఎప్ బస్టాండు కూడలిలో ప్రజలను ఉద్దేశించి అమరనాథరెడ్డి మాట్లాడారు. సీఎం జగన్ డ్రామాలను జనం నమ్మే పరిస్థితి లేదన్నారు.

బైపాస్ అలైన్‌మెంట్ మారుస్తాం..

గత టీడీపీ హయాంలో మంజూరు చేసిన షాదీ మహల్, అంబేడ్కర్ భవన్, కోల్డ్ స్టోరేజ్, బీసీ భవన్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారని అమరనాథరెడ్డి వివరించారు. ముఖ్యంగా వి.కోటకు బైపాస్ రోడ్డు కర్ణాటక మీదుగా తరలిస్తే ఇక్కడి అధికార పార్టీ నేతలు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తూర్పు దిశగా అలైన్‌మెంట్ మార్పుచేసి తీరుతామని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిల్ చట్టం వల్ల కలిగే అనర్థాలను ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, నాయకులు రాంబాబు, సుబ్బన్న, చౌడప్ప, సోము, విశ్వనాథ్, ధీరజ్, శబరీష్, నారాయణస్వామి, సతీష్, జనార్ధన్ రెడ్డి, నాగరాజ్, చంద్రారెడ్డి, శివకుమారి, నాసీర్, రుహుల్లా, షేక్‌ఉమ్మర్, నారాయణరాజు, ఉదయ్, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

కుప్పం, మే 9: దళితుల అభివృద్ధి టీడీపీతోనే ముడిపడి ఉందని ఆ పార్టీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. కుప్పంలో గురువారం జరిగిన దళితుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన పలు విషయాలపై చర్చించారు. అధికారం వచ్చిన వెంటనే యువతకోసం ప్రత్యేకంగా ఒక కార్యాలయం ఏర్పాటు చేసి, హెల్ప్‌డెస్క్ పెట్టి ఉద్యోగావకాశాలు, సలహాలు, స్కిల్ డెవలప్మెంట్ చేస్తామని అన్నారు. ఇదంతా జరగాలంటే రాష్ట్రంలో సమర్థమైన నాయకుడు చంద్రబాబు సీఎం కావాలని తెలిపారు. రాష్ట్రం బాగుపడితే దళితులు, బీసీ, మైనారిటీ వర్గాలు బాగుపడతాయన్నారు. యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన వైసీపీకి తగిన బుద్ధి చెప్పి టీడీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని దగ్గుమళ్ల కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు.


దళితుల ఆత్మీయ సమావేశంలో దగ్గుమళ్లకు సన్మానం

ఆది, సోమవారాల్లో పత్రికా ప్రకటనలకు
ముందస్తు అనుమతి అవసరం

● అభ్యర్థులకు జిల్లా ఎన్నికల అధికారి సూచన

చిత్తూరు కలెక్టరేట్, మే 9: ఎన్నికల సంఘం జారీచేసిన ఉత్తర్వుల మేరకు ఈనెల 12, 13 తేదీల్లో (పోలింగ్‌కు ముందురోజు, పోలింగ్ రోజు) పత్రికల్లో ప్రకటనల నిమిత్తం అభ్యర్థులు రెండ్రోజులు ముందుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. పత్రికా యాజమాన్యాలు కూడా ఎంసీఎంసీ అనుమతి పత్రాలు లేకుండా ప్రకటనలు ప్రచురించరాదని సూచించారు. అభ్యర్థి, పార్టీ తరఫున సంస్థలు లేదా వేరే వ్యక్తి ఇచ్చే ప్రకటనలకు సైతం ఇవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

రైతుల మేలు కోరేది కాంగ్రెస్సే


ప్రచారం నిర్వహిస్తున్న రమేష్

పెనుమూరు, మే 9: రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గంగాధర నెల్లూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన పెనుమూరు టౌన్‌లో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్‌కి ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఓబీసీ మాజీ ఉపాధ్యక్షుడు బుల్లెట్ రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు చందురాణి, నాయకులు చంద్రబాబు, కన్నన్, సుబ్బరాజులు, జయరాజ్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

కార్వేటినగరం : జీడీ నెల్లూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు కార్వేటినగరంలో గురువారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. రాష్ట్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు.

పూతలపట్టు, రంగంపేటలలో...

పూతలపట్టు, మే9: పూతలపట్టు, రంగంపేట గ్రామాల్లో గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు ఎంపీ అభ్యర్థి జగపతితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను ప్రజాసేవ కోసమే మళ్ళీ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నానని, ఇందులో వేరే ఉద్దేశం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు దీన, రెడ్డెప్ప, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నగరి మే9: నగరి పట్టణం కేవీపీఆర్ పేట నుంచి పలువురు వైసీపీ నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వైసీపీకి చెందిన కుప్పస్వామి, కుమరేశన్, ఎల్లప్పన్, లోకనాథన్, అన్నాదొరై, వినాయకం, పాండు రంగనాథన్ ముత్తు, అచ్యుతన్, రామకోటి మురుగన్, జ్యోతి దయాలన్‌లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బాబు, నటరాజమొదలియార్, చిరంజీవిరెడ్డి సుధాకర్‌రాజు, దివాకర్, డీఎంకే నాయకులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోసలనగరంలో టీడీపీలో చేరిక



విజయపురం, మే 9: మండలంలోని బాషా, వెంకటేష్‌యాదవ్ తదితరులు చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సోమశేఖర్, హరికృష్ణ, వెంకటరాజు, బాషా, రాజేంద్రరాజు, నర్సింహులు రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎంపీ అభ్యర్థి ప్రచారం

విజయపురం, మే 9: చిత్తూరు పార్లమెంటు బీఎస్పీ ఎంపీ అభ్యర్థి తొగురు విజయకుమార్‌ను గెలిపించాలని గురువారం పన్నూరు, జీఎంపురం, బూచివానత్తం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అభ్యర్థితోపాటు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగూర్, మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు సెల్వం, సుబ్బరాయలు, ప్రేమావతి, శైలజ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆరణి భారీ ర్యాలీ

చిత్తూరు సిటీ, మే 9: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు మద్దతుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మురకంబుట్టు నుంచి దొడ్డిపల్లి, కట్టమంచి, హైరోడ్డు, గాంధీ సర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, కణ్ణన్ కాలేజి , గిరింపేట సర్కిల్,, పాతబస్టాండు, కొత్త బస్టాండు మీదుగా జీజేఎం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

టీడీపీ అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

పాలసముద్రం, మే 9: టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును గెలిపించాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు కోరారు. గురువారం పాలసముద్రం, వెంగళరాజుకుప్పంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఆరు గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, ప్రభాకర్ రాజు, మాధవరాజు, లోకనాథ నాయుడు, జానకిరామ నాయుడు, జె. విజయ్‌కుమార్, వాసు యాదవ్, సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు.